# తెలుగురాష్ట్రం

APTEL/2016/66202

తెలుగు దినపత్రిక

అమలాపురం | సంపుటి : 10 సంచిక : 36 | ఎడిటర్ : ఎ. రాజశేఖర్ | శుక్రవారం 28 మార్చి 2025 | పేజీలు 8 వెల : 5/-

published : Amalapuram Vol:10 Issue : 36 28-03-2025 Editor : A.RAJASEKHAR Pages : 8 Rs: 5/-







## 2027 నాటికి పోలవరం పూర్తి చేస్తాం..

**నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లిస్తాం: చంద్రబాబు**
**జగన్ కారణంగానే పోలవరం ఆలస్యం**



**పోలవరం మార్చి 27 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

పోలవరం - టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో పోలవరం నిర్వాసితులకు రూ.4,311 కోట్లు చెల్లించామని అన్నారు. కానీ, వైసీపీ ప్రభుత్వం నిర్వాసితులకు రూ.10 లక్షల చొప్పున ఇస్తామని హామీ ఇచ్చి.. పట్టించుకున్న పాపాన పోలేదని అన్నారు ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబు.. పోలవరం ప్రాజెక్ట్ పనులను ఆయన నేడు పరిశీలించారు.. అమరావతి నుంచి నేరుగా పోలవరం చేరుకున్న ఆయన ముందుగా ఏరియల్ సర్వే ద్వారా ప్రాజెక్ట్ పనులను పరిశీలించారు. ఆయన వెంట జిల్లా ఇంచార్జి మంత్రి నాదెండ్ల మనోహర్, జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు తదితరులు ఉన్నారు. అనంతరం పోలవరం నిర్వాసితులతో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరు అయ్యారు. ఇక, గత కొన్నేళ్లగా ఎదురైన సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబుకి పోలవరం నిర్వాసితులు వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ భావోద్వేగానికి లోనయ్యారు. పోలవరం ప్రాజెక్ట్ కోసం నిర్వాసితులు వేల ఎకరాల్లో భూములు త్యాగం చేశారని గుర్తు చేశారు. భూములు ఇచ్చినోళ్లను గత ప్రభుత్వం తీవ్ర ఇబ్బందులకు గురి చేసిందని ఫైర్ అయ్యారు. నిర్వాసితులను చూస్తే తనకు బాధేస్తోందని.. వరదలు వచ్చినా గత ప్రభుత్వం ఇటు వైపు కూడా చూసిన దాఖలాలు లేవన్నారు.

నిర్వాసితులను ఆదుకున్న ప్రభుత్వం తమదేనని

- తరువాయి 2లో..





## నేడు టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ

**అమరావతి మార్చి 27 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

నేడు టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి, బిల్ గేట్స్ ఫౌండేషన్‌కు మధ్య కీలక ఒప్పందం కుదిరిన విషయం తెలిసిందే. రాష్ట్ర అభివృద్ధిలో భాగంగా ఈ ఒప్పందాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ఏపీ ప్రభుత్వం తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది. గేట్స్ ఫౌండేషన్‌తో కలిసి ఒప్పందాన్ని సమర్ధవంతంగా అమలు చేయడానికి ప్రత్యేకంగా టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఏపీ ప్రభు త్వం తాజాగా

- తరువాయి 2లో..



## ఏప్రిల్ 27 నుంచి వేసవి సెలవులు

**అమరావతి మార్చి 27 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

తెలుగు రాష్ట్రాల్లోని విద్యార్థులకు వేసవి సెలవులు ప్రకటించబోతున్నారు. ఇప్పటికే ఏపీలో పాఠశాలలకు ఏప్రిల్ 27 నుండి జూన్ 11 వరకు వేసవి సెలవులు కాగా ,స్కూళ్లు తిరిగి జూన్ 12న ప్రారంభం కానున్నాయి. తెలంగాణలోనూ పాఠశాలలకు భారీగానే వేసవి సెలవులు ఉండనున్నాయి.ఈ రెండూ రాష్ట్రాల విద్యార్థులకు వేసవి సెలవులు గణనీయంగా ఉండబోతున్నాయి.గత సంవత్సరం వడగాడ్పులు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో, ఈ ఏడాది కూడా ఎండ తీవ్రత పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. దీంతో వేసవి సెలవుల తేదీల్లో మార్పు వచ్చే అవకాశం ఉందని కొంతమంది వ్యక్తం చేస్తున్నారు. అయితే,

- తరువాయి 2లో..

## స్మార్ట్ ఆంధ్రప్రదేశ్ ఫౌండేషన్‌కు రూ.50 లక్షల విరాళం



**అమరావతి మార్చి 27 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**


వెలగపూడి - స్మార్ట్ ఆంధ్రప్రదేశ్ ఫౌండేషన్ కు పశ్చిమ గోదావరి జిల్లా దేవరపల్లికి చెందిన పరమేసు బయోటెక్ లిమిటెడ్ రూ.50 లక్షల విరాళం అందజేసింది. ఉండవల్లి నివాసంలో మంత్రి నారా లోకేష్ ను ఆ కంపెనీ డైరెక్టర్ ఆనంద స్వరూప్ అదవానీ నేడు కలిశారు. ఈ సందర్భంగా ఆయన రూ.50 లక్షల చెక్ ను మంత్రికి అందజేశారు. ప్రజల జీవితాల్లో మార్పు తెచ్చేందుకు, విద్యా ప్రమాణాలు మెరుగుపర్చేందుకు ఏర్పాటు చేసిన స్మార్ట్ ఆంధ్రప్రదేశ్ ఫౌండేషన్ కు విరాళం అందజేసిన పరమేసు బయోటెక్ లిమిటెడ్ ప్రతినిధులను నారా లోకేష్ అభినందించారు

**మాట నిలుపుకున్న నారా లోకేష్ ..**

మంత్రి నారా లోకేష్ ఇచ్చిన మాటను మరోసారి నిలుపుకున్నారు.. దుగ్గిరాల

- తరువాయి 2లో..

## మరోసారి శ్రీవారి ఆలయంపై నుంచి విమానం.. టీటీడీ ఆగ్రహం !



**తిరుపతి మార్చి 27 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

మరోసారి తిరుమల శ్రీవారి ఆలయంపై నుంచి విమానం వెళ్లింది. దీంతో టీటీడీ తీవ్రంగా మండిపడింది. ఇప్పటికే పలుమార్లు కేంద్ర విమానయాన శాఖకు విజ్ఞప్తి చేసిన పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇదే విషయాన్ని కొద్ది రోజుల క్రితమే కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి దృష్టికి తీసుకువెళ్లినట్లు టీటీడీ అధికారులు చెప్పుకొచ్చారు. అయినా తమ విజ్ఞప్తిని కేంద్ర విమానయాన సంస్థ పట్టించుకోవటం లేదని తిరుమల తిరుపతి దేవస్థానం పేర్కొంది.

**గతంతో పోలిస్తే ఇవాళ గోపురం సమీపంపై నుంచే విమానం**

అయితే, ఆగమశాస్త్ర నిభందనల ప్రకారం శ్రీవారి ఆలయ గోపురంపై నుంచి విమాన రాకపోకలు లేకుండా చూడాలని కేంద్ర ప్రభుత్వానికి సైతం టీటీడీ అధికారులు కోరారు. ఇవాళ కూడా శ్రీవారి ఆలయ గోపురంపై నుంచే విమానం వెళ్లింది. గతంతో పోలిస్తే ఇవాళ గోపురం సమీపంపై నుంచే విమానం వెళ్లింది. దీంతో విమానయాన శాఖ వైఖరిపై భక్తులు కూడా ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇప్పటికైనా కేంద్ర పౌర విమానయాన మంత్రి తిరుమలను

- తరువాయి 2లో..



## పుష్కర ఏర్పాట్లకు ఇద్దరు అధికారులను నియమించిన ఏపీ ప్రభుత్వం


**రాజమహేంద్రవరం మార్చి 27 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

రాజమహేంద్రవరం కేంద్రంగా 2027లో గోదావరి పుష్కరాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో, పుష్కరాలకు సంబంధించి ఇప్పటి నుంచే తగిన ముందస్తు ఏర్పాట్ల పర్యవేక్షణకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఆయన ఇద్దరు ఐఏఎస్ అధికారులను ప్రత్యేకంగా నియమించారు. వీరపాండ్యన్‌ను ప్రత్యేక అధికారిగా, వి. విజయరామ రాజును అదనపు ప్రత్యేక అధికారిగా నియమిస్తూ అధికారిక ప్రకటన చేశారు. ఈ ఇద్దరు అధికారులు పుష్కరాల ఏర్పాట్లకు సంబంధించి సమగ్ర ప్రణాళికను రూపొందించి, పర్యవేక్షణ బాధ్యతలను నిర్వర్తించనున్నారు.

**%పుష్కరాల నిర్వహణపై ముఖ్యమంత్రి దృష్టి**

2027లో జరగబోయే గోదావరి పుష్కరాలను అత్యంత ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. తూర్పు గోదావరి, కాకినాడ, కోనసీమ జిల్లాల్లో పుష్కరాలకు సంబంధించిన

- తరువాయి 2లో..



## ఏపీలో వచ్చే మూడు రోజులు వర్ష సూచనలు

**రాజమహేంద్రవరం మార్చి 27 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఆంధ్రప్రదేశ్ లో రాబోయే మూడు రోజుల్లో ఆంధ్రప్రదేశ్‌లో వాతావరణ పరిస్థితులు ప్రాంతాలవారీగా మారుతూ ఉంటాయని సూచనలు ఇచ్చింది విపత్తుల నిర్వహణ సంస్థ. వచ్చే 3 రోజుల్లో ఈ ప్రాంతాల్లో వడగాలులు ఉండనున్నాయి.దక్షిణ ఛత్తీస్‌గఢ్ నుంచి గల్ఫ్ ఆఫ్ మన్నార్ వరకు ఉన్న నిన్నటి ఉత్తర-దక్షిణ ద్రోణి ఇప్పుడు ఉత్తర మధ్య మహారాష్ట్ర నుండి ఉత్తర కేరళ వరకు అంతర్గత కర్ణాటక మీదుగా సగటు సముద్ర మట్టానికి 0.9 కి.మీ ఎత్తు వరకు విస్తరించి ఉన్నది.ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్ యానాం లో ఈరోజు కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశముంది. ఉరుములతో కూడిన మెరుపులు కూడా సంభవించవచ్చు.?రేపు, ఎల్లుండి: పొడి వాతావరణం కొనసాగుతుంది. గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుండి 4 డిగ్రీల సెంటీగ్రేడ్ ఎక్కువగా నమోదయ్యే అవకాశముంది.?


**దక్షిణ కోస్తా ఆంధ్ర**

పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉంది. గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదు ధోరణి 2 నుండి 4 డిగ్రీల సెంటీగ్రేడ్ ఎక్కువగా ఉండే అవకాశముంది.గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణముగా కంటే 3 నుండి 4 డిగ్రీల సెంటీగ్రేడ్ ఎక్కువగా నమోదయ్యే అవకాశముంది.

**వడగాలులు హెచ్చరిక**

వడగాలులు, అధిక ఉష్ణోగ్రతల కారణంగా, ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.?తగినంత నీరు త్రాగి, డీహైడ్రేషన్‌ను నివారించండి.

- తరువాయి 2లో..




## కడప జడ్పీ పీఠం వైసిపిదే..

తిరుపతి, ఆంధ్రప్రభ బ్యూరో (రాయలసీమ) %-% వైఎస్సార్ కడప జిల్లా: వైఎస్సార్ కడప జిల్లా జడ్పీ ఛైర్మన్ పదవి వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకుంది. వైఎస్సార్ జిల్లా పరిషత్ చైర్మన్‌గా వైఎస్సార్సీపీ జడ్పీటీసీ రామగోవిందరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. . ఒకే ఒక్క నామినేషన్ రావడంతో ఏకగ్రీవం అయినట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. అనంతరం రామగోవిందరెడ్డి జడ్పీ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేశారు.

జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధ్యక్షత న ఉదయం జరిగిన సమావేశం లో ఈ ఎన్నిక నిర్వహించారు.. బి.మఠం జడ్.పి.టి.సి ముత్యాల రాంగోవిందరెడ్డి మినహా మిగిలిన వారు ఏవరూ నామినేషన్ చేయకపోవడం తో ఎకగ్రీవం అయినట్లు ప్రకటించిన జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ ప్రకటించారు. గత స్థానిక ఎన్నికల్లో గెలిచి జిల్లా పరిషద్ చైర్మన్ గా ఎన్నికైన అమరనాథ రెడ్డి గత అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి గా రాజంపేట నియోజకవర్గం నుంచీ పోటీ చేసి గెలుపొందడం తో ఇప్పుడు ఎన్నిక అనివార్యం అయింది. కూటమి ప్రభుత్వం రాష్ట్రాధికారం చేపట్టగానే కేవలం ఒక్క జడ్ పి టి సి మాత్రమే

- తరువాయి 2లో..

# సంపాదకీయం

## ఏం జరుగనున్నది సామీ?

ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి యశ్వంత్ వర్మ అధికారిక నివాస ప్రాంగణంలోని ఔట్ హౌస్‌లో డబ్బుల బస్తాలు కాలిన విషయంపై అన్ని వర్గాలవారూ అనేక సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంలో సుప్రీం కోర్టును ఆశ్రయించిన మాథ్యూస్ జె నెడుంపరాతో పాటు మిగతా వారూ బుధవారం (మార్చి 26) సుప్రీం కోర్టులో ఈ విషయమై ఫిర్యాదును నమోదు చేసి, దర్యాప్తును చేపట్టమని ఢిల్లీ పోలీసులను వెంటనే ఆదే శించాలని వాదించారు. అయితే అందుకు సుప్రీం కోర్టు తిరస్కరించింది.

మార్చి14 నాడు న్యాయమూర్తి వర్మ నివాస ప్రాంగణంలో జరిగిన అగ్ని ప్రమాదంలో కాలిన నోట్ల వ్యవహారం బయటపడినా ఇంతవరకు ఎఫ్ఐఆర్ నమోదు కాకపోవడం, ఈ సంఘటనపై పోలీసు అధికారులు, అగ్నిమాపక శాఖ అధికారులు మాట్లాడిన మాటల మధ్య పొంతనలేక పోవడం వంటి కారణాలతో న్యాయవ్యవస్థపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని కొలీజియం మార్చి 24 సోమవారం జస్టిస్ యశ్వంత్ వర్మను ఢిల్లీ హైకోర్టు నుండి అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేయాలని ప్రభుత్వానికి సిఫారసు చేసింది. అలాగే కొలీజియం ముగ్గురు సభ్యుల కమిటీని కూడా ఈ వ్యవహారంపై అంతర్గత దర్యాప్తు చేయడానికి నియమించింది. అయితే ఈ కమిటీకి దర్యాప్తు చేయడానికి ఎటువంటి అధికారమూ లేదని నెడుంపారా వాదించారు. భారీగా నగదు నోట్లు కాలిపోయాయి కాబట్టి ఇది భారతీయ న్యాయ సంహిత ప్రకారం కాగ్నిజన్స్ నేరం కిందకు వస్తుందనేది ఆయన వాదన. నిజానికి ఇది ప్రతి ఒక్కరి వాదన కూడా. కొలీజియం ఆ కమిటీకి విచారణ అధికారాన్ని ఇవ్వడం చెల్లదన్న వాదనా సరైనదే.

పార్లమెంట్ లేదా రాజ్యాంగం స్వయంగా ఆ అధికారం కల్పించకపోతే, కొలీజియం తనంతట తానే విచారణ చేయించుకునే అధి కారం కల్పించుకోలేదు. జస్టిస్ వర్మ తన నివాస ప్రాంగణంలో కాలిపోయిన డబ్బు తనది కాదనీ, దీనివెనుక ఏదో కుట్ర ఉందనీ అంటున్న మాటలనూ అనుమానించవలసి వస్తోంది. ఆ డబ్బు తనది కాకపోతే ఆయన వెంటనే పోలీసు లకు ఫిర్యాదు చేసి, తనపై తప్పుగా కుట్ర పన్నేందుకు యత్నించిన వారిపై ఎఫ్ఐఆర్‌ను నమోదు చేయాలని ఎందుకు కోరలేదన్న నెడుంపరాతో అందరూ ఏకీభవిస్తున్నారు. జస్టిస్ యశ్వంత్ వర్మ నివాస ప్రాంగణంలో చోటు చేసుకున్న అగ్నిప్రమాద వీడియోలను సుప్రీంకోర్టు వెబ్ సైట్‌లో పెట్టారు. దేశ అత్యున్నత కోర్టు ప్రధాన న్యాయ మూర్తి ఏదీ దాచకుండా దొరికిన అన్ని దృశ్యాలకు సంబంధించిన వీడియోలను అందరికీ కనబడే పని చేశారు. ఇదే న్యాయ సమాచార హక్కు.

**అనుమానాలివీ!**

మూటలలో డబ్బునోట్ల కట్టలు 'దొరికాయి'. కష్టపడి సంపాదించిన సొమ్ము పోగొట్టుకుంటారా?' అని ఢిల్లీ పోలీసు కమిషనర్ అన్న మాటలను అర్థం చేసుకోవాలి. ఢిల్లీ అగ్నిమాపక శాఖ ముఖ్య అధికారి అతుల్ గార్గ్ కాలిన నోట్లేమీ లేవని ముందు అన్నారు. ఆ తర్వాత తాను అలా అనలేదని మాట మార్చారు. మొత్తానికి అగ్నిమాపక శాఖ ఇచ్చిన రిపోర్టు 'హిందీ' భాషలో ఉంది. ఆ గదిలో మంటలు రేగినట్లు, మంటలు ఆపడానికి ప్రయత్నం చేసినప్పుడు అందులో సగం కాలిన నోట్లు ఉన్నాయని అందులో ఉంది.

పోలీసులు ప్రమాదం స్థలానికి చేరిన సమ యంలో ఆ కాలిన నోట్లు కనపడ్డాయి. అప్పుడు దొరికిన నోట్లను అక్కడే ఎందుకు ఉంచలేదు? జడ్జిగారి అధికారిక ఇంట్లోనే లెక్క చూపని డబ్బు దొరికినపుడు అది కాగ్నిజబుల్ నేరం అవు తుంది కదా. పోలీసులు నేరస్థలంలో ఉన్న పరి స్థితిని ఆదే విధంగా ఉంచాలి, దాన్ని మార్చడానికి వీల్లేదు. అగ్ని ప్రమాదం జరిగిన స్థలంలో స్టోర్ రూంను లాక్ చేసి ఉంచాలని డాక్యుమెంట్ చెబుతున్నది. లాక్ చేసి ఉంచాం అని సీఆర్‌పీఎఫ్ గార్డ్ రూం రిపోర్ట్ అంటున్నది.

మరి తాళం వేసి ఉంటే జస్టిస్ వర్మ అంటున్నట్లు పనివాళ్లు ఆ రూమ్‌ను ఎప్పుడు పడితే అప్పుడు ఎలా వాడుకోగలుగుతారు? నియమాల ప్రకారం, ఏదైనా అక్రమ సొమ్ము స్వాధీనం చేసుకున్నట్లయితే, దాన్ని పోలీస్ స్టేషన్ లో నమోదు చేసి, తర్వాత కోర్టుకు సమర్పించాలి. అదే విధంగా నేర సంఘటన జరిగినట్లయితే, పంచనామా కూడా తయారు చేయాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియను పాటించారా లేదా అనేది తెలియడం లేదు.

సీజేఐ చర్యలు అద్భుతంగా ఉన్నాయని ఉప రాష్ట్రపతి మెచ్చుకుంటున్నారని అంటున్నారు. అదే సందర్భంలో మన దేశం 2010లో ప్రవేశపెట్టిన 'న్యాయ ప్రమాణాలు%-%జవాబు దారీ బిల్లు' (జుడీషియల్ స్టాండర్డ్స్ అండ్ అకౌంటబిలిటీ బిల్%-%2010)ను మళ్లీ చట్టంగా తీసుకురావడానికి ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని అంటున్నారు. సుప్రీంకోర్టును కూడా ఇదేవిధంగా ఆదేశించమని కూడా కోరారు.

ఇది న్యాయవ్యవస్థలో అవినీతిని తగ్గించడానికి కీలకంగా ఉపయోగపడుతుందని న్యాయవాది నెడుంపరా వివరించారు. ఇదైనా విని న్యాయం చెబుతారని నమ్మకతప్పదు. ఏం జరగబోతున్నది? ఈ దెబ్బతో 2010 బిల్లు తెచ్చి న్యాయ వ్యవస్థను సైతం కేంద్రం చేతిలోకి తీసుకునే కుట్ర ఏదో నడు స్తున్నదని అనుమానాలు వస్తున్నాయి. ఏం జరుగనున్నది సామీ?

# 2047 నాటికి మురికివాడల రహిత రాష్ట్రంగా ఏపీ

## విజన్ 2047లో 10 సూత్రాల అమలుతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తాం..


### అమరావతి కేవలం మౌళిక వసతుల ప్రాజెక్ట్ మాత్రమే కాదు..

### నాణ్యమైన జీవన ప్రమాణాలు కూడా ఉంటాయి: మంత్రి నారాయణ

**అమరావతి మార్చి 27 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

**విజయవాడలో స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ లో స్వర్ణాంధ్ర 2047 సదస్సుకు ముఖ్య అతిథిగా మంత్రి నారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2047 నాటికి మురికివాడల రహిత నగరంగా ఏపీని తీర్చిదిద్దాలనే లక్ష్యంతో పని చేస్తున్నామని తెలిపారు. విజన్ 2047లో 10 సూత్రాల అమలుతో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందించాలనేది సీఎం చంద్రబాబు ప్రధాన లక్ష్యం అని పేర్కొన్నారు. దేశం వందేళ్ల స్వాతంత్ర్య వేడుకలు జరుపుకునే నాటికి రాష్ట్రాన్ని సమగ్రమైన, సమతుల్యమైన అభివృద్ధి నమూనాగా రూపొందిస్తాం.. వికసిత్ భారత్ లక్ష్యాలను దృష్టిలో ఉంచుకుని సీఎం చంద్రబాబు విజన్ 2047ను రూపొందించారని మంత్రి పొంగూరు నారాయణ చెప్పుకొచ్చారు.**






ఇక, విజన్ 2047లో కీలక అంశంగా అమరావతి కూడా ఉందని మంత్రి నారాయణ తెలిపారు. అమరావతి కేవలం మౌళిక వసతుల ప్రాజెక్ట్ మాత్రమే కాదు.. నాణ్యమైన జీవన ప్రమాణాలు ఉండేలా డిజైన్ చేశాం.. పట్టణాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ లో అర్బన్ డెవలప్మెంట్ కేటాయించడం ఎంతో ముఖ్యమైన అంశం.. కేంద్ర నిధులతో రాష్ట్రంలో పట్టణాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పుకొచ్చారు. ఆర్థిక వనరుల వినియోగం ద్వారా పట్టణాల అభివృద్ధికి ప్లానర్లు, ఆర్కిటెక్ట్ లు సహకారం అందించాలని నారాయణ కోరారు.

## 2027 నాటికి పోలవరం పూర్తి చేస్తాం..

అన్నారు. 2019లో టీడీపీ ఆధికారంలో కొనసాగి ఉంటే.. 2020లోనే పోలవరం పూర్తయ్యేది తెలిపారు. ఎప్పుడో పూర్తి కావాల్సి ప్రాజెక్టును జగన్ సర్కార్ మరుగును పడేసిందని.. ఇప్పుడు ప్రాజెక్ట్ ఆలస్యమై.. ఖర్చు కూడా విపరీతంగా పెరిగిపోయిందని అన్నారు. ఎప్పుడో పూర్తి కావాల్సిన పోలవరం ప్రాజెక్టును జగన్ పక్కన పెట్టారు. ఈ ప్రాజెక్టు సొమ్మును ఇతర పథకాలకు మళ్లించారు. రూ.829 కోట్లు నేరుగా నిర్వాసితుల ఖాతాలో వేసిన ఘనత మా ప్రభుత్వానిది. పోలవరంలో నీళ్లు వదిలే ముందే.. 2027 నవంబర్ నాటికి పునరావాసం పూర్తిచేస్తాం. దళారులు, మోసగాళ్లకు అవకాశం లేకుండా చర్యలు తీసుకుంటాం. నిర్మాణంలో ఆలస్యం వల్ల హైడల్ ప్రాజెక్టు వ్యయం భారీగా పెరిగింది. 2027 డిసెంబర్ నాటికి ప్రాజెక్టును పూర్తిచేస్తాం. మన ఎన్డీయే ప్రభుత్వం వచ్చింది.. సకాలంలో ప్రాజెక్టును పూర్తిచేసుకుందాం" అని చంద్రబాబు అన్నారు. 2014-2019 మధ్య మొత్తం 33 సార్లు ప్రాజెక్ట్‌ను సందర్శించానని అన్నారు. పోలవరం నిధులను గత సర్కార్ యథేచ్ఛగా దారి మళ్లించిందని ఆరోపించారు. 2027 నాటికి పునరావాసం పూర్తి చేస్తామని.. నిర్వాసితులకు పరిహారం ఇచ్చాకే ప్రాజెక్ట్ నుంచి నీళ్లు వదుతామని స్పష్టం చేశారు. అదేవిధంగా అధికారులు ప్రతి ఒక్కరికి పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు వేదిక పైనుంచే ఆదేశాలు జారీ చేశారు. తమ ప్రభుత్వం వచ్చిందని.. అందరికీ న్యాయం చేస్తుందని చంద్రబాబు అన్నారు.

## నేడు టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ

టాస్క్ ఫోర్స్ ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ బృందంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు, బిల్ గేట్స్ ఫౌండేషన్ సభ్యులు ఉంటారు. ఈ సహకారం ద్వారా పలు కీలక రంగాల్లో ప్రగతి సాధించడం లక్ష్యం. ముఖ్యంగా సుపరిపాలన, వ్యవసాయం, ఆరోగ్యరంగం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం, జీవన ప్రమాణాల మెరుగుదల వంటి అంశాలపై ఈ ఒప్పందం ప్రభావం చూపనుంది.

**ఢిల్లీలో చంద్రబాబు %-% బిల్ గేట్స్ భేటీ**

ఇటీవల, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఢిల్లీలో బిల్ గేట్స్‌తో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర అభివృద్ధికి సంబంధించి పలు కీలక చర్చలు జరిగాయి. ముఖ్యంగా సాంకేతికతను ఉపయోగించి వ్యవసాయం, ఆరోగ్యరంగాల్లో ప్రగతి సాధించేందుకు వీలుగా బిల్ గేట్స్ ఫౌండేషన్‌తో అనుసంధానం చేయాలని సీఎం నిర్ణయం తీసుకున్నారు. గతంలో కూడా చంద్రబాబు నాయుడు హయాంలో మైక్రోసాఫ్ట్‌తో పాటు పలు అంతర్జాతీయ సంస్థల భాగస్వామ్యంతో ఏపీకి టెక్నాలజీ ప్రాతిపదికన అభివృద్ధి చేయాలని ప్రయత్నాలు జరిగాయి. అదే దారిలో గేట్స్ ఫౌండేషన్‌తో ఒప్పందం కుదరడం వల్ల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి అనేక ప్రయోజనాలు ఉండనున్నాయి. ముఖ్యంగా ఆధునిక సాంకేతికతను ఉపయోగించి వ్యవసాయ రంగాన్ని మరింత ముందుకు తీసుకెళ్లే అవకాశాలు మెరుగుపడతాయి.

**టాస్క్ ఫోర్స్ కార్యాచరణ ఏమిటి?**

ఈ టాస్క్ ఫోర్స్ ముఖ్యంగా గేట్స్ ఫౌండేషన్‌తో రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య అనుసంధానకర్తగా వ్యవహరిస్తుంది. ఒప్పందం ద్వారా తీసుకురాబోయే కొత్త కార్యక్రమాలను సమీక్షించడం, వాటి అమలు తీరు పరిశీలించడం, అవసరమైన మార్పులను సూచించడం వంటి బాధ్యతలు ఈ బృందానికి అప్పగించనున్నారు. ఈ ఒప్పందం ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో అత్యాధునిక సాంకేతికతను అందుబాటులోకి తేనున్నట్టు ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ టెక్నాలజీ, ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయ రంగాల్లో గేట్స్ ఫౌండేషన్ అనుభవాన్ని ఉపయోగించుకునేందుకు వీలు కలుగుతుంది.

**సాంకేతికతతో మెరుగైన భవిష్యత్తు**

ఈ ఒప్పందంతో ఏపీ స్మార్ట్ టెక్నాలజీ హబ్‌గా మారే అవకాశాలు ఉన్నాయని, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ఇది మేలైన అవకాశమని పరిశీలకులు భావిస్తున్నారు. ముఖ్యంగా రాష్ట్రానికి అత్యుత్తమ సాంకేతిక పరిజ్ఞానం అందించడంలో బిల్ గేట్స్ ఫౌండేషన్ భాగస్వామ్యం కీలకంగా మారనుంది. ఈ టాస్క్ ఫోర్స్ రూపంలో రాష్ట్రాభివృద్ధికి మద్దతుగా బిల్ గేట్స్ ఫౌండేషన్‌తో ప్రభుత్వం పని చేయనున్నది. దీంతో వ్యవసాయం, ఆరోగ్యరంగాల్లో పెద్ద ఎత్తున మార్పులు వచ్చే అవకాశాలు ఉన్నాయి.

## ఏప్రిల్ 27 నుంచి వేసవి సెలవులు

ఇంకా తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా ఖరారు చేయాల్సి ఉంది. ఒకటి లేదా రెండు రోజుల్లో పాఠశాలల వేసవి సెలవులపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది.

**ఏపీ ఇంటర్ విద్యలో మార్పులు**

ఏపీలో కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం ఇంటర్ విద్యా వ్యవస్థలో కొన్ని కీలక మార్పులను అమలు చేయనుంది. ఇప్పటివరకు ఏటా జూన్ 1న ప్రారంభమయ్యే ఇంటర్ విద్యా సంవత్సరం, ఈ ఏడాది నుంచిఏప్రిల్ 1న ప్రారంభమయ్యే అవకాశముంది. దీనికి సంబంధించి అకడమిక్ క్యాలెండర్ సిద్ధం చేసినట్లు సమాచారం. ఇంటర్మీడియట్ అడ్మిషన్లు ఏప్రిల్ 7 నుంచి ప్రారంభమవుతాయని, క్లాసులు ఏప్రిల్ 24 నుంచి మొదలవుతాయని సంబంధిత విద్యా శాఖ వర్గాలు వెల్లడించాయి. దీంతో విద్యార్థులకు కొత్త షెడ్యూల్ ఉండబోతుంది. మే నెలాఖరు వరకు వేసవి సెలవులు కొనసాగి, జూన్ 2న తిరిగి తరగతులు ప్రారంభం కానున్నాయి. ఈసారి మొత్తం 235 రోజులు తరగతులు జరగనున్నట్లు సమాచారం. అదేవిధంగా, వేసవి సెలవులు కాకుండా విద్యార్థులకు మొత్తం 79 హాలిడేలు ఉంటాయని కూడా పేర్కొంటున్నారు. సాధారణంగా, అకడమిక్ క్యాలెండర్ ప్రకారం, ప్రతి ఏడాది విద్యా సంవత్సరం మే లేదా జూన్ మధ్య ముగుస్తుంది. ఈ మార్పులతో విద్యార్థులు, తల్లిదండ్రులు, కాలేజీ యాజమాన్యాలు కొత్త షెడ్యూల్‌కి అలవాటు పడాల్సి ఉంటుంది. మే నెలాఖరు వరకూ సెలవులు ఇచ్చినప్పటికీ, జూన్ 2 నుంచి తిరిగి కాలేజీలు ప్రారంభమవుతాయి. ఇదిలా ఉండగా, తెలంగాణలో ఇంటర్ విద్యా సంవత్సరం షెడ్యూల్ ఇంకా ఖరారు కావాల్సి ఉంది. ప్రభుత్వ అధికారిక ప్రకటన వెలువడిన తర్వాత విద్యార్థులు తదనుగుణంగా ప్లాన్ చేసుకోవచ్చు. ఈ మార్పులపై ఇంకా అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ప్రభుత్వ నిర్ణయం ప్రకారం విద్యార్థులు వారి వార్షిక విద్యా ప్రణాళికలను సిద్ధం చేసుకోవాల్సి ఉంటుంది. ఇక పాఠశాలలు, ఇంటర్ విద్యా సంస్థల షెడ్యూల్ మార్పులతో విద్యార్థులు ముందుగా ప్రణాళికలు వేసుకోవడం మంచిది.

## స్మార్ట్ ఆంధ్రప్రదేశ్ ఫౌండేషన్‌కు రూ.50 లక్షల విరాళం

ఎంపిపిగా అవకాశం ఇస్తానని గతంలోనే ఆ పార్టీకి చెందిన ఎంపిటిసి షేక్ జెబిన్ కు హామీ ఇచ్చారు.. ఈ నేపథ్యంలో నేడు జరిగిన ఎంపిపి ఎన్నికలలో దుగ్గిరాల ఎంపీపీ గా కూటమి అభ్యర్థి ( టిడిపి) షేక్ జెబిన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.. దుగ్గిరాలలో మొత్తం 10 మంది ఎంపీటీసీల మద్దతు ఉండటంతో ఈ ఎన్నికకు వైసిపి దూరంగా ఉంది.. దీంతో జెబిన్ ఎన్నిక ఏకగ్రీవమైంది.. ఈ సందర్భంగా గెలుపొందిన ఎంపిపి కి టిడిపి నాయకులు నందం అబద్ధయ్య , పోతినేని శ్రీనివాసరావు, కేశంనేని శ్రీ అనిత, గూడూరు వెంకట్రావు, తదితరులు అభినందనలు తెలిపారు.

## మరోసారి శ్రీవారి ఆలయంపై నుంచి విమానం.. టీటీడీ ఆగ్రహం !

నో-ఫ్లై జోన్ గా ప్రకటించాలని డిమాండ్ చేశారు. మరోసారి శ్రీవారి ఆలయంపై నుంచి

**ఇకనైనా ఇలాంటి సంఘటనలు జరగకుండా**

కూటమిలో చంద్రబాబు ఉన్నప్పటికీ దీనిపై గట్టిగా కేంద్రాన్ని ప్రశ్నించడం లేదని కొంత మంది భక్తులు నిలదీస్తున్నారు. ఇకనైనా ఇలాంటి సంఘటనలు జరగకుండా చూడాలని కోరుతున్నారు. కాగా, హోంమంత్రి అనిత ఈ అంశంపై స్పందించారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి ఈ అంశం వచ్చిందని దీనిపై దర్యాప్తుకు ఆదేశించామన్నారు. నివేదికలు వచ్చిన వెంటనే కేంద్రంతో రాష్ట్ర ప్రభుత్వం చర్చించి శ్రీవారి ఆలయం పైనుంచి విమానాల రాకపోకలు జరుగకుండా చూస్తామని తెలిపారు.

## పుష్కర ఏర్పాట్లకు ఇద్దరు అధికారులను నియమించిన ఏపీ ప్రభుత్వం

ప్రణాళికలను ఇప్పటికే సిద్ధం చేయడం ప్రారంభమైంది. ముఖ్యంగా, రాజమహేంద్రవరం ప్రధాన కేంద్రంగా ఈ పుష్కరాలు జరగనుండటంతో నగరంలో అన్ని ఏర్పాట్లు ముందుగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, ప్రభుత్వం ముందస్తుగా అన్ని విభాగాలను సమన్వయం చేస్తోంది. పుష్కరాల సందర్భంగా భక్తుల రద్దీ అధికంగా ఉండటం, కుంభమేళా తరహాలో పెద్దఎత్తున భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో, అనుకున్న ప్రణాళికల ప్రకారం సమర్థవంతమైన ఏర్పాట్లు చేయడం అత్యవసరం. ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా ఇదే విషయాన్ని హైలైట్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల కలెక్టర్లతో జరిగిన రెండో రోజు సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పుష్కరాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించారు. ముఖ్యంగా తూర్పు గోదావరి, కాకినాడ, కోనసీమ జిల్లాల కలెక్టర్లు, పుష్కరాల కార్యాచరణ ప్రణాళికలపై ప్రజెంటేషన్ ఇచ్చారు. గోదావరి పరిసర ప్రాంతాలను మరింత ఆకర్షణీయంగా మార్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తోంది. భక్తులకు మెరుగైన వసతులు కల్పించేందుకు ప్రభుత్వం ఇప్పటికే ప్రణాళికలు రూపొందించింది. అఖండ గోదావరి ప్రాజెక్టు పూర్తి చేయాలని, సుందర ప్రదేశాలు, ఆలయాలు సందర్శించేలా పర్యాటకులను ఆకర్షించే ప్రణాళికలు రూపొందించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు

## ఏపీలో వచ్చే మూడు రోజులు వర్ష సూచనలు

అవసరమైతే మాత్రమే బయటకు వెళ్లండి, ముఖ్యంగా మధ్యాహ్న సమయంలో.?పిల్లలు, వృద్ధులు, గర్భిణీ స్త్రీలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. దయచేసి తాజా వాతావరణ సమాచారాన్ని స్థానిక వాతావరణ శాఖ లేదా అధికారిక వార్తా మాధ్యమాల ద్వారా తెలుసుకోండి, ఎందుకంటే వాతావరణ పరిస్థితులు మారుతుండవచ్చు. ఉరుములు, మెరుపులు ఉన్నప్పుడు చెట్ల కింద లేదా బహిరంగ ప్రదేశాల్లో ఉండకండి. వీలైనంత వరకు ఇంట్లో ఉండండి. ఇంట్లో విద్యుత్ పరికరాలను ఆఫ్ చేయండి. లోతట్టు ప్రాంతాల్లో నివసించే వారు ముందు జాగ్రత్తగా ఉండండి. డ్రైనేజ్ వ్యవస్థ దుర్వాసన వస్తే, దాన్ని వెంటనే శుభ్రం చేయించుకోండి. ఫ్లడ్ హెచ్చరికలుంటే అవసరమైన వస్తువులు సిద్ధం చేసుకోండి.

## కడప జడ్పీ పీఠం వైసిపిదే..

ఉన్న తెలుగుదేశం ఎలాగైనా జడ్ పి చైర్మన్ పదవిని దక్కించుకోవాలని భావించింది. ఈ నేపథ్యంలో గత అరేడునెలాలుగా వ్యూహ ప్రతివ్యూహాల నడుమ చైర్మన్ పదవిని కైవసం చేసుకోడానికి తెలుగుదేశం పార్టీ, నిలబెట్టుకోడానికి వైసీపీ ఎత్తులు పై ఎత్తులతో పావులు కదిపాయి. రెండు రోజుల క్రితం బలం లేని చోట చేసే ప్రయత్నం ప్రభుత్వానికి చెడ్డ పేరు తెస్తుందని కూటమి ప్రభుత్వ నేతలు భావించడం తో తెలుగుదేశం పోటీ చేయరాదనీ నిర్ణయించుకుంది. ఫలితంగా ఈరోజు జరిగిన ఎన్నికలో కడప జిల్లా పరిషద్ చైర్మన్ పదవిని వైసీపీ తిరిగి దక్కించుకున్నట్టయింది.

**పలు ఎంపిపి స్థానాలలో వైసిపి అభ్యర్థుల విజయం**

ప్రకాశం జిల్లా త్రిపురాంతకం ఎంపీపీగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఆళ్ల సుబ్బమ్మ విజయం సాధించారు. అనంతపురం జిల్లా పరిషత్ ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ సత్తా చాటింది. రొద్దం ఎంపీపీ స్థానాన్ని వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకుంది. ఆ పార్టీ అభ్యర్థి నాగమ్మ ఘన విజయం సాధించారు. రాయదుర్గం నియోజకవర్గం కణేకల్ ఎంపీపీ వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకుంది. తిరుపతి రూరల్ ఎంపీపీ స్థానం వైఎస్సార్‌సీపీ సొంతం చేసుకుంది. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మూలం చంద్రమౌళిరెడ్డి గెలుపొందారు. ఆయనకు 33 మంది వైఎస్సార్‌సీపీ సభ్యులు మద్దతునిచ్చారు. విశాఖ జిల్లా నర్సీపట్నం నియోజకవర్గ మాకవరపాలెం ఎంపీపీగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థి రుత్తుల సర్వేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బలం లేకపోవడంతో టీడీపీ ఎంపీటీసీలు పోటీకి దూరంగా ఉన్నారు మాడుగుల ఎంపీపీగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థి తాళ్లపురెడ్డి రాజారాం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎస్. రాయవరం మండల ఎంపీపీగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కేసుబోయిన వెంకటలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దేవరపల్లి మండలం ఎంపీపీగా చింతల భూలోక లక్ష్మీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

# మహిళలు తలుచుకుంటే సాధించలేనిది ఏదీ లేదు

**-అవకాశాలు ఇవ్వాలేకానీ అద్భుతాలు సృష్టిస్తారు-మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి-మహిళల ఆర్థిక స్వావలంబన కోసమే సీఎం చంద్రబాబు డ్వాక్రా తెచ్చారు-కుప్పంలో ఎలీప్ ఆధ్వర్యంలో మహిళలకు శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించిన నారా భువనేశ్వరి**







**కుప్పం, మార్చి 27 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):** మహిళలు తలుచుకుంటే సాధించలేనిది ఏమీ లేదని, మహిళలకు అవకాశాలు ఇవ్వాలేకానీ అద్భుతాలు సృష్టిస్తారని నారా భువనేశ్వరి అన్నారు. మహిళలు వారి కాళ్లపై వారు నిలబడి ఆర్థికంగా బలోపేతం అవడం కోసమే సీఎం చంద్రబాబు డ్వాక్రా స్థాపించారని, మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు కూటమి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని అన్నారు. కుప్పంలో ఎలీప్ ఆధ్వర్యంలో మహిళలకు 6 రోజులపాటు నిర్వహించే శిక్షణా తరగతులను నారా భువనేశ్వరి ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళలను ఉద్దేశించి మాట్లాడారు. ఎలీప్ నా మనసు దోచుకుందిమహిళల్లో ఉన్న ప్రతిభను వెలికితీసి, వారికి సరైన శిక్షణ అందించడం ద్వారా పారిశ్రామికవేత్తలుగా తయారుచేయడంలో ఎలీప్ చేస్తున్న కృషి నా మనసును దోచుకుంది. రమాదేవి గారు ఆమె టీం సభ్యులందరూ ఎలీప్ ద్వారా అనేకమంది మహిళలను ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దారు. అందుకోసం వారు హైదరాబాద్ లో ఇన్నాళ్లు చేసిన కృషి అమోఘం. అందుకు వారిని మనస్పూర్తిగా అభినందిస్తున్నాను. మహిళలు ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలిచంద్రబాబు గారు హైదరాబాద్ లో ఎలీప్ ఏర్పాటు చేశారు. ఎలీప్ నా కళ్ల ముందు పుట్టి ఎదిగింది. మహిళా పారిశ్రామిక వేత్తల కోసం కుప్పంలో ఎలీప్ ఏర్పాటు కాబోతోంది. దీని ద్వారా మహిళలు పారిశ్రామికవేత్తలుగా తయారై మరో పదిమందికి ఉద్యోగాలు కల్పించే స్థాయికి చేరుకుంటారు. స్త్రీలు శక్తిమంతులు. మగవారిని మించి పనిచేయగలరు. నేను ఇది చేయలేను అనే భయం లేకుండా ముందడుగు వేయాలి. అప్పుడే అద్భుతాలు సాధించగలరు. సాధారణ గృహిణిగా ఉన్న నాకు చంద్రబాబు గారు హెరిటేజ్ బాధ్యతలు అప్పగించారు. అన్నీ స్వయంగా నేర్చుకున్నాను. ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా మేము కూడా మహిళల ఆర్థిక స్వావలంబనకు పాటుబడుతున్నాము. వారి స్వయం ఉపాధికి చేయూత అందిస్తున్నాము. ఎలీప్ ఏర్పాటు విషయంపై ఐఏఎస్ అధికారి వికాస్ గారితో ఎప్పటికప్పుడు మాట్లాడుతున్నాను. కుప్పం పరిధిలో పెద్ద పరిశ్రమలతో పాటు చిన్న తరహా పరిశ్రమలు కూడా రాబోతున్నాయి. వాటిలో పని చేయడం ద్వారా మహిళలకు ఆర్థిక వెసులుబాటు కలుగుతుందని నారా భువనేశ్వరి అన్నారు.








## అచ్చెన్నకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన సత్తిరాజు స్వామి



**రాజోలు, మార్చి 27(తెలుగురాష్ట్రం విలేకరి):** రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖల మంత్రి, డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఇంచార్జి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకు రాజోలుకు చెందిన ప్రముఖ న్యాయవాది, తెలుగుదేశం నాయకులు సత్తిరాజు స్వామి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం రాత్రి విజయవాడలోని మంత్రి అచ్చెన్నాయుడి క్యాంపు కార్యాలయానికి వచ్చిన స్వామి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. టిడిపి మీడియా కోఆర్డినేటర్ బోళ్ళ సతీష్ బాబు, ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ పురోహిత సమాఖ్య ఉపాధ్యక్షులు ఉపద్రష్ట నాగార్జున తదితరులు అచ్చెన్నకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

## రీసర్వే ప్రక్రియను సజావుగా పూర్తి చేయాలి

**అమలాపురం, మార్చి 27, (తెలుగురాష్ట్రం ప్రతినిధి):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీసర్వే ప్రక్రియను సజావుగా పూర్తి చేయాలని అంబేద్కర్ కోనసీమ జిల్లా జాయింట్ కలెక్టర్ టీ నిషాంతి సూచించారు. గురువారం అమలాపురం కలెక్టరేట్ లో జిల్లాలోని మూడు డివిజన్లకు చెందిన తహశీల్దార్లు, ఉప తహశీల్దార్లు, మండల, గ్రామ సర్వేయర్లు, వీఆర్వోలకు రీసర్వేపై శిక్షణ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పైలెట్ కార్యక్రమం దాదాపుగా పూర్తి కావస్తుందని రెండవ దశలో ప్రతి మండలంలో రెండు గ్రామాలను ఎంపిక చేసి సర్వే నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ సూచించారు. రెవెన్యూ రికార్డులలోని లోపాలను సరిదిద్ది భవిష్యత్ తరాలకు మంచి నిర్మాణాత్మక వ్యవస్థను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్తులో ఎలాంటి సమస్యలు రాకుండా చూడాలని అధికారులను కోరారు. క్షేత్ర స్థాయిలో ఎదురైన సవాళ్లను పరిష్కరిస్తామని, అవసరమైతే చట్టపరమైన సవరణలను పరిశీలిస్తామని ఆమె స్పష్టం చేశారు. గ్రామాల్లో రెవెన్యూ సదస్సుల నిర్వహణ ద్వారా మరొక సారీ లోపాలన్నింటిని గుర్తించి సరిచేసేందుకు పకడ్బందీగా భూముల రీసర్వే చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. పాస్ బుక్ రూపం కూడా మార్చాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ పాస్ పుస్తకంపై రాజముద్ర క్యూర్ కోడ్ తో వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ బిఎల్ఎన్ రాజకుమారి, ఆర్డీవోలు పి. శ్రీకర్, డి.అఖిల, కేమాధవి తదితరులు పాల్గొన్నారు




## పోలవరం ప్రాజెక్ట్ పనులను పరిశీలించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు





**ఏలూరు, మార్చి , 27,తెలుగురాష్ట్రం ప్రతినిధి** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గురువారం పోలవరం ప్రాజెక్ట్ లోని పలు విభాగాలలో పనుల ప్రగతిని పరిశీలించారు. గురువారం ఉదయం 12.10 ని. లకు పోలవరం చేరుకున్న ముఖ్యమంత్రి ముందుగా ప్రాజెక్ట్ వ్యూ పాయింట్ నుండి పనుల ప్రగతిని పరిశీలించారు. పనుల ప్రగతిని జలవనరుల శాఖా మంత్రి డా. నిమ్మల రామానాయుడు, జలవనరుల శాఖ సలహాదారు ఎం. వెంకటేశ్వరరావు, ప్రాజెక్ట్ సూపెరింటెండెండింగ్ ఇంజనీర్ రెడ్డి రామచంద్రరావు, తదితరులు ముఖ్యమంత్రికి ప్రాజెక్ట్ పనుల ప్రగతిని ముఖ్యమంత్రి కి వివరించారు. అనంతరం అప్పర్ కాఫర్ డాం చేరుకొని, అక్కడ పనుల పురోగతిపై అధికారులు ఏర్పాటుచేసిన ఫోటో ఎగ్జిబిషన్ ను పరిశీలించి, వివరాలను ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్యాప్ – 1, డయాఫ్రమ్ వాల్ చేరుకొని అక్కడ పనుల పురోగతిపై అధికారులు ఏర్పాటుచేసిన ఫోటో ఎగ్జిబిషన్ ను పరిశీలించి, వివరాలను ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైబ్రో కంప్యాక్షన్ చేరుకొని అక్కడ పనుల పురోగతిపై అధికారులు ఏర్పాటుచేసిన ఫోటో ఎగ్జిబిషన్ ను పరిశీలించి, వివరాలను ఇంజనీరింగ్ అధికారులను ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. సిఎం వెంట జిల్లా ఇంచార్జి మంత్రివర్యులు నాదెండ్ల మనోహర్, రాష్ట్ర మంత్రులు డా. నిమ్మల రామానాయుడు, కొలుసు పార్థసారధి, ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త పెందుర్తి వెంకటేష్, ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ,శాసనసభ్యులు చిర్రి బాలరాజు, బడేటి రాధాకృష్ణయ్య (చంటి), మద్దిపాటి వెంకటరాజు, పత్సమట్ల ధర్మరాజు, చింతమనేని ప్రభాకర్, డా. కామినేని శ్రీనివాస్, సొంగా రోషన్ కుమార్, పితాని సత్యనారాయణ, జ్యోతుల నెహ్రూ, ఏలూరు రేంజి ఐజి జి.వి.జి. అశోక్ కుమార్, జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి, ఎస్పీ కె. ప్రతాప్ శివకిశోర్, జిల్లా జాయింట్ కలెక్టర్ పి . ధాత్రిరెడ్డి, ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాస్, ఏపీ ఏఎస్ సిపిసి చైర్మన్ పీతల సుజాత, ఏపి కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, ప్రాజెక్ట్ ఇంజనీరింగ్ సిబ్బంది, ప్రభృతులు ఉన్నారు.





https://epaper.teluguraastram.com
తెలుగురాష్ట్రం దినపత్రిక

## డాక్టర్ అగర్వాల్ కంటి ఆసుపత్రి బ్రాంచ్ ప్రారంభోత్సవం




ఏలూరు, మార్చి 27,(తెలుగురాష్ట్రం ప్రతినిధి)

డాక్టర్ అగర్వాల్ కంటి ఆసుపత్రి నూతన బ్రాంచ్ ను గురువారం డాక్టర్ విజయ, వైస్ ప్రెసిడెంట్ మిస్టర్ గణేష్, డాక్టర్ టి. శాంత ఏలూరు , డాక్టర్ కేకేఆర్ చక్రవర్తి విజయవాడ చేతుల మీదుగా జ్యోతి ప్రజల్వన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కేకేఆర్ చక్రవర్తి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ లో ఏలూరులో డాక్టర్ అగర్వాల్ 21వ బ్రాంచి ప్రారంభించడం ఎంతో సంతోషకరమని తెలియజేశారు. కంటికి సంబంధించిన అన్ని శస్త్ర చికిత్సలు, అత్యాధునిక టెక్నాలజీతో 24 గంటలు డాక్టర్స్ అందుబాటులో ఉంటుందని తెలియచేసారు . డాక్టర్ అగర్వాల్ కంటి ఆసుపత్రిలో ఏప్రిల్ 30 వరకు డాక్టర్ కన్సల్టేషన్, ఫ్రీ చెకప్ అందుబాటులో ఉన్నాయని ఏలూరు ప్రజలందరూ ఈ సేవలను ఉపయోగించుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ టి. శాంత ఏలూరు , డాక్టర్ కేకేఆర్ చక్రవర్తి విజయవాడ, వైస్ ప్రెసిడెంట్ గణేష్, డాక్టర్ అగర్వాల్ ఆసుపత్రి సిబ్బంది మార్కెటింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## మానవత్వంతో స్పందించిన రెడ్ క్రాస్ ఛైర్మన్ ఢిల్లీ నారాయణ



అమలాపురం, మార్చి 27(తెలుగురాష్ట్రం ప్రతినిధి):

ప్రమాదంలో తీవ్రంగా గాయపడి వైద్యం చేయించుకోలేని నిస్సహాయ ఆర్థిక పరిస్థితుల్లో ఇంటి వద్దనే జీవచ్ఛవంలా ఉన్న చిక్కం కేశవరావుకు మానవతా మూర్తులు - సేవాసంస్థ అధ్యక్షులు బోనం రాజు కొంత ఆర్థిక సాయం అందించారు. అతని ఆరోగ్యం గురించి స్థానికులు ఎవరైనా ముందడుగు వేసి అతన్ని ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తూ సోషల్ మీడియాలో ప్రచారం చేశారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా రెడ్ క్రాస్ ఛైర్మన్ కోరుకొండ సత్యనారాయణ (ఢిల్లీ నారాయణ) తక్షణమే స్పందించి అందుబాటులో ఉన్న రెడ్ క్రాస్ సభ్యులతో కేశవరావు నివసిస్తున్న ఇంటికి వెళ్ళి అతని పరిస్తితి చూసి చలించిపోయారు. వెంటనే డిఎంహెచ్ఓ, అమలాపురం ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్, తదితర డాక్టర్లతో మాట్లాడి మెరుగైన వైద్యం కోసం నిన్నటి రోజున అతన్ని అమలాపురం ఏరియా ఆసుపత్రిలో చేర్చారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ తమ పరిధిలో మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేస్తామన్నారు. రెడ్ క్రాస్ ఛైర్మన్ మాట్లాడుతూ జిల్లా రెడ్ క్రాస్ సహాయ కార్యదర్శిగా ఉన్న బోనం రాజు ఈ సమస్యను తమ దృష్టికి తీసుకురావటంతో మానవతా కోణంలో తమ వంతు ప్రయత్నం చేసి మెరుగైన వైద్యం కోసం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చేలా కృషి చేసామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఛైర్మన్ నారాయణతో పాటు డి. సి. హెచ్.ఎస్. డాక్టర్ కె.కార్తీక్ , అడిషనల్ డి.ఎం .అండ్ హెచ్. ఓ శ్రీమతి భరత లక్ష్మి, హాస్పిటల్ సూపర్నెంట్ డాక్టర్ కె. శంకరరావు, డాక్టర్ జై రాంజీ బాబు, డాక్టర్ విజయలక్ష్మి, రమేష్, రెడ్ క్రాస్ సభ్యులు పట్నాల రమణ, శ్రీమతి జల్లి సుజాత, శేఖర్, ఫీల్డ్ కోఆర్డినేటర్ రత్న ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## పాస్టర్ ప్రవీణ్ మృతి పై న్యాయ విచారణ జరిపించాలి

మలికిపురం మార్చి 27(తెలుగురాష్ట్రం ప్రతినిధి)



పాస్టర్ పగడాల. ప్రవీణ్ మృతి పై న్యాయవిచారణ విచారణ చేయాలి.దళిత హక్కుల పోరాట సమితి ( డి హెచ్ పి ఎస్ ) జిల్లా గౌరవాధ్యక్షుడు దేవ. రాజేంద్రప్రసాద్ డిమాండ్.వారం రోజుల క్రితం తనకు ప్రాణహాని ఉందని, బెదిరింపు ఫోన్ కాల్స్ వస్తున్నాయని చెప్పినా పోలీసులు సరిగా స్పందించక పోవడంతో పాస్టర్ ప్రవీణ్ మృతి ప్రమాధవశాత్తు జరిగిందా? ఎవరైనా హత్యాచేశారా? అనే విషయం నివృత్తి కావాలంటే ప్రస్తుత న్యాయమూర్తి చేత విచారణ చేయాలని దళిత హక్కుల పోరాట సమితి అంబేద్కర్ కోనసీమ జిల్లా గౌరవాధ్యక్షులు దేవ.రాజేంద్రప్రసాద్,జిల్లా అధ్యక్షుడు నల్లి.బుజ్జిబాబు,కార్యదర్శి మోకా.శ్రీనివాసరావులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ప్రవీణ్ కు తగిలిన గాయాలను బట్టి ఇదిహత్యా,? ప్రమాదమా అనే అనుమానాలు కలుగుతున్నాయని,ప్రవీణ మృతి నిగ్గుతేలాలంటే నిష్పాక్షపాతంగా పోలీసులు విచారణ చేయాలని,పోస్టుమార్టం రిపోర్ట్ రాకుండానే ప్రమాదవశాత్తు మరణించారని చెప్పడం అనుమానాలకు తావిస్తుందని అన్నారు.పాస్టర్ ప్రవీణ్ మృతి పట్లజిల్లా దళిత హక్కుల పోరాట సమితి సంతాపం వ్యక్తం చేసింది.ఆయన కుటుంబ సభ్యులకు రాజేంద్రప్రసాద్ ప్రఘాడ సానుభూతి తెలిపారు.

## ఇండియన్ ఆర్మీలో ఉద్యోగావకాశాల కు ప్రారంభమైన ఆన్ లైన్ లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ

### -ఔత్సాహిక యువత రిజిస్ట్రేషన్ చేసుకోండి-జిల్లా కలెక్టర్

చిత్తూరు జిల్లా, మార్చి 27: (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



ఇండియన్ ఆర్మీలో ఉద్యోగావకాశాల కొరకు ఆన్ లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభమయ్యిందని, ఔత్సాహిక యువత రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇండియన్ ఆర్మీ రిక్రూట్మెంట్ కార్యాలయం, గుంటూరు వారు అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్మెంట్ ఉద్యోగాల కొరకు మార్చి 15 నుండి ఆన్ లైన్ ప్రక్రియ ప్రారంభించడం జరిగిందని,వెబ్ సైట్ ద్వారా దరఖాస్తును సమర్పించేందుకు 2025 ఏప్రిల్ 10 ఆన్ లైన్ లో దరఖాస్తు సమర్పించుటకు చివరి తేది అని ఆ ప్రకటనలో తెలిపారు.

## 2 కోట్ల71 లక్షలతో ఆరు వాటర్ ట్యాంక్ ప్రారంభించాం

### -రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్





మలికిపురం మార్చి 27 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

రెండు కోట్ల 71 లక్షల రూపాయలతో నిర్మించిన 6 వాటర్ ట్యాంకులు ప్రారంభోత్సవం రాజోలు మండలంలో రెండు కోట్ల 71 లక్షల రూపాయల జలజీవన్ మిషన్ నిధులతో నూతనంగా నిర్మించిన ఆరు వాటర్ ట్యాంకులను ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ప్రారంభోత్సవం చేసి ప్రజలకు అంకితం చేశారు.శివకోడు 120 రాజోలు 60 పొదలాడ 40 బి.సావరం 40 కడలి సెంటర్ 40 కడలి వాసంశెట్టి వారి గ్రూప్ 40 కే ఎల్ రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ మాట్లాడుతూ రాజోలు నియోజకవర్గం గత రెండు దశాబ్దాలుగా నిర్లక్ష్యానికి గురైందని మంచినీటి సమస్యను పరిష్కరించాలంటే ముందు కరెంట్ సమస్యను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్న అని అన్నారు.రీసెంట్ గా గుడిముల 33/11 కేవీ సబ్ స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన. గుడిమెళ్ళంక సబ్ -స్టేషన్ త్వరగా మంజూరు చెయ్యాలని అదనంగా 3 వది శంకరగుప్తంలో కూడా సబ్ స్టేషన్ మంజూరు చెయ్యాలని ప్రతిపాదనలు పంపినారు.నియోజకవర్గానికి అత్యవసరంగా 250 కొత్త ట్రాన్స్ఫార్మర్లు మంజూరు చేయాలని కాలిపోయిన 50 ట్రాన్స్ఫార్మర్ల ను రీప్లేస్ చెయ్యాలని,రాజోలు 33/11 సబ్ స్టేషన్ లో 5 ఎం వి ఏ , పి టి ఆర్ ను 8 ఎం వి ఏ పి టి ఆర్ గా ఇంప్రూవ్ చెయ్యాలని మంచినీటి విషయంలో సుమారు 1650 కోట్ల రూపాయలతో ధవలేశ్వరం గోదావరి నుండి నేరుగా పైప్ లైన్ ద్వారా నీరు సరఫరా చేసి సురక్షిత మంచి నీరు అందించే పథకం త్వరలోనే మంజూరు కాబోతోంది అని తద్వారా మంచినీటి సమస్యను పరిష్కరించే విధంగా కృషి చేస్తాను అని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు,ఆర్డబ్ల్యూఎస్ అధికారులు పాల్గొన్నారు.

## అవసరమైన 'అప్పు'డే రొక్కం! వార్షిక రుణ ప్రణాళికలో మార్పులు

### - సద్వినియోగంతో జీవనోపాధులు మెరుగు




ఒంగోలు మార్చి 27(తెలుగురాష్ట్రం ప్రతినిధి)

అప్పు.. ఆపదలో అక్కరకు వచ్చేలా.. అవసరాలు తీర్చేదిలా ఉండాలి. 'అప్పుడే సార్థకత. అలా కాకుండా అధికారులు తమకు ఇష్టమొచ్చినప్పుడు ఇస్తామంటే కొన్నిసార్లు కొరగాకుండా పోతుంది.ఈ విషయాన్ని గుర్తించిన కూటమి ప్రభుత్వం మహిళా స్వయం సహాయక సంఘాలకు అందిస్తున్న రుణ సదుపాయంలో మార్పులు చేస్తోంది. దీంతో బ్యాంకర్లు, వెలుగు సిబ్బంది చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన పరిస్థితి లేకుండా అతివలు కోరినప్పుడే వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి రుణం దక్కనుంది. ఇందుకుగాను ప్రతి సభ్యురాలు తమకు అప్పు నిల్వ ఎంత ఉంది. రాబోయే సంవత్సరంలో తన కుటుంబ అవసరాలు, జీవనోపాధుల యూనిటి ఏర్పాటుకు ఎంత పెట్టుబడి అవసరం వంటి వివరాలను యాప్లో ముందే నమోదు చేసుకోవాల్సి ఉంది.రుణం, జీవనోపాధుల కార్యాచరణ ప్రణాళిక తీరుతెన్నులపై గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ అధికారులు ప్రస్తుతం జిల్లా, మండల, గ్రామ స్థాయిలో సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి మహిళా ఎన్యుమరేటర్లు స్వయం సహాయక సభ్యురాలి ఇంటికి వెళ్లి.. జీవనోపాదులకు మీకేం కావాలి, ఎంత రుణం అవసరం. ఎప్పుడు కావాలో తెలుసుకుంటారు. ఇంటి అవసరాలు, పిల్లల పెళ్లిళ్లు, చదువులు, ఇల్లు కట్టుకోవడానికి, స్వయం ఉపాధి, యంత్రాల కొనుగోలు, వైద్యం ఖర్చులకు ఎంత అవసరం ఉంటుంది. అది ఏ నెలలో, ఎంత కావాలో తెలుసుకుని నమోదు చేస్తారు. తద్వారా ఒక మహిళకు సంవత్సరంలో ఎంత రుణం అవసరమో తెలుస్తుంది. మెరుగైన జీవనానికి ఉపయోగపడుతుంది. 'ఎప్పుడు పడితే అప్పుడు కాకుండా.. అవసరమైనప్పుడే రుణం తీసుకుంటే సద్వినియోగం చేసుకుంటే లక్ష్యం చేరుకుంటారని డీఆర్డీఏ పీడీ టి. నారాయణ తెలిపారు.కుటుంబ అవసరాలు తీరడం, జీవనోపాధుల యూనిట్ల ద్వారా ఆర్థికాభ్యున్నతి పొందుతారని చెప్పారు. ఈ విషయాలపై జిల్లాలోని 38 మండలాల డిపీఎం, ఏసీ, ఏపీఎం. సీసీ సిబ్బందితో ఒంగోలులోని టీటీడీసీ కార్యాలయంలో జిల్లా సెర్ప్ ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీనివాస్ తో కలిసి బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించినట్లు వివరించారు.

## వాస్తు పండిట్ సుబ్రమణ్యంకు సీవీ రామన్ పురస్కారం



భీమవరం మార్చి 27, (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంకు చెందిన జ్యోతిష్య వాస్తు పండిట్ బ్రహ్మశ్రీ సన్నిధిరాజు జయప్రకాశ్ సుబ్రమణ్యం సీవీ రామన్ అకాడమీ పురస్కారాన్ని అందుకున్నారు. సీవీ రామన్ అకాడమీ (సేవా, సాంస్కృతిక సంస్థ ) ప్రతి ఏడాది వివిధ రంగాలలో ప్రతిభా పాటవాలు ప్రదర్శించిన వారికి పురస్కారాలు అందచేస్తుందని, ఇందులో భాగంగా ఈనెల 16న హైదరాబాద్ లో హరిహర కళాభవన్లో జరిగిన అవార్డ్ ల ప్రదానోత్సవంలో ఈ పురస్కారాన్ని అందుకున్నట్లు సుబ్రమణ్యం తెలిపారు. గత 22 సంవత్సరాలుగా జ్యోతిష్య వాస్తు అంశాలలో విశేష సేవలందిస్తున్నానని, దీనిలో భాగంగానే సీవీ రామన్ అకాడమీ పురస్కారాన్ని అందుకున్నట్లు తెలిపారు. అవార్డు అందుకున్న సుబ్రమణ్యంను పట్టణ పండితులు ప్రముఖులు అభినందించారు.

## ప్రకాశం జిల్లా పునర్వికాసానికి కావాలి సాయం.. సీఎం దృష్టికి సమస్యలు.. లక్ష్యాలు

### - సదస్సులో నివేదించిన కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు మార్చి 27(తెలుగురాష్ట్రం ప్రతినిధి)



ప్రకాశం జిల్లా అయిదేళ్లవైకాపా పాలనలో జిల్లా అన్ని రంగాల్లో విధ్వంసానికి గురైంది. అభివృద్ధి పూర్తిగా పడకేసింది. ఇలాంటి పరిస్థితుల్లో కొలువుదీరిన కూటమి ప్రభుత్వం పునర్వికాసంపై దృష్టిసారించింది.ఆ దిశగా చేపట్టాల్సిన అంశాలపై కలెక్టర్లను నివేదిక కోరింది. ఈ సందర్భంగా 2025-20 ఆర్థిక సంవత్సరానికి జిల్లా కార్యాచరణ ప్రణాళిక, ప్రజల ఆశలు, ఆకాంక్షాల నివేదికను కలెక్టర్ తమీమ అన్సారియా త్రైమాసిక సమావేశంలో భాగంగా సీఎం చంద్రబాబు వద్ద ప్రదర్శించారు. లక్ష్యాలు తెలుపుతూ.. ఆరు ప్రధాన సమస్యల పరిష్కారానికి నిధులు అవసరమని కోరారు.జిల్లా కలెక్టర్ ప్రస్తావించిన ప్రధాన సమస్యలు ఇవి...ఎన్నెస్పీ కాలువ కాలువలో నాచు పేరుకుపోయింది. జమ్ము, ముళ్లపొదలు పెరిగాయి. నిర్వహణ లోపంతో పూడిక పేరుకుపోవడంతో పాటు శిథిలమైంది. మరమ్మతులు చేపట్టాల్సి ఉంది. కావాల్సిన నిధులు: రూ.9.83 కోట్లు.జిల్లా కేంద్రంలోని ఒంగోలు డెయిరీ మూతపడింది. విలువైన పాల పొడి తయారీ యంత్రాలు మూలనపడ్డాయి. భవనాలు దెబ్బతింటున్నాయి. సామగ్రి తుప్పుపడుతోంది. పునరుద్ధరిస్తే 40 వేల మంది పాడి రైతులకు, పరోక్షంగా వేల మందికి ఉపాధి లభిస్తుంది.కావాల్సిన పైకం: సుమారు రూ.75 కోట్లకు పైగా .పూల సుబ్బయ్య వెలిగొండ సాగునీటి ప్రాజెక్ట నిర్మాణంతో 7,321 మంది ప్రజలు భూములు, ఇళ్లు కోల్పోయి నిర్వాసితులయ్యారు. వీరందరికీ ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కింద పరిహారం అందించి పునరావాసం కల్పించాల్సి ఉంది నిర్వాసితులకు 2026 వరకు ఆర్అండ్ఆర్ వర్తింపజేయాలి.కావాల్సిన నిధులు: రూ.889 కోట్లు.పద్నాలుగు మండలాల్లోని 230 అవాసాల్లో తాగునీటి ఎద్దడి నెలకొంది. నివారణకు ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేయాల్సి ఉంటుంది.అవసరమైన నిధులు: రూ. 11.20 కోట్లు.ఒంగోలులోని ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయానికి వసతి గృహాలు, తరగతుల నిర్వహణకు భవనాలు, కనీస సౌకర్యాలు లేవు. విద్యార్థులు, ఆధ్యాపకులు ఇబ్బందులు పడుతున్నారు. పోస్టుల మంజూరుతో పాటు మౌలిక వసతులు కల్పనకు నిధులు కావాలి.అవసరమైన సాయం: రూ.203.15 కోట్లు.ఒంగోలు ట్రిపుల్బాటీ కళాశాలల ఇంజినీరింగ్, పీయూసీ విద్యార్థుల తరగతుల నిర్వహణకు శాశ్వత భవనాలు లేవు. వేర్వేరు క్యాంపస్లో ఉంటున్నారు. నూతన భవనాల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు కేటాయించాలి.ఇవీ ఎదుట ఉన్న లక్ష్యాలు..పంట ఉత్పత్తుల లక్ష్యం అయిదు నుంచి పది శాతం పెంపు.75 వేల మంది రైతులకు చెందిన 50 వేల హెక్టార్లలో 44 డ్రోన్లతో ఆధునిక వ్యవసాయం. 15,797 మంది వినియోగదారుల ఇళ్లపై పీఎంఎస్ జీఎంబీవై కింద సౌర పలకలు అమర్చి 92 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి.రూ. 88.96 కోట్లతో తొమ్మిది వేల ఇళ్ల నిర్మాణం.పల్లె పండగలో 216 కి. మీ. సీసీరోడ్లు. 62.44 6.మీ. అప్రోచ్ రోడ్ల నిర్మాణం.బీచ్, ఎకో, అధ్యాత్మిక టూరిజం ఏర్పాటుతో పర్యాటకుల సంఖ్య పెంపు. మార్కాపురంలో మిర్చి మార్కెట్ యార్డు ఏర్పాటు ఆవశ్యకత ఉన్నదని సమస్యలను పేర్కొన్నారు.

## శానిటేషన్ సిబ్బంది ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతూ, వారి ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవాలి



కృష్ణ జిల్లా మచిలీపట్నం : మార్చి 27 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

శానిటేషన్ సిబ్బంది సేవలు ఎనలేనివి...... నాగార్జున పబ్లిక్ స్కూల్ అధినేత, వి. సుందర రామ్...మచిలీపట్నం నగర కార్పొరేషన్ 45వ డివిజన్ పరిధిలోని శానిటేషన్ సిబ్బందికి నాగార్జున పబ్లిక్ స్కూల్ అధినేత , వి. సుందర రామ్ శానిటేషన్ సిబ్బంది కి వారి ఆరోగ్యం పై అవగాహన కల్పించి గురువారం డివిజన్ శానిటేషన్ సిబ్బందికి హ్యాండ్ గ్లౌజులు, టోపీలు ఉచితంగా అందజేశారు.....ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి నాగార్జున పబ్లిక్ స్కూల్ అధినేత, వి. సుందర రామ్ మాట్లాడుతూ.....శానిటేషన్ సిబ్బంది సేవలు మరువలేనివి అని, ప్రతినిత్యం ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే విధంగా ఎండనక, వాననక, చలి అనక తెల్లవారుజాము నుండి తడి చెత్త, పొడి చెత్త వేరు చేస్తూ ఇంటింటికి వెళ్లి చెత్త తీసుకుని , డ్రైనేజీలు శుభ్రపరుస్తూ ప్రజలను రోగాల బారి నుండి కాపాడుతూ శానిటేషన్ సిబ్బంది ప్రజలకు చేస్తున్న సేవలు ఎప్పటికీ మరువలేనివి అన్నారు.మచిలీపట్నం నగరం అభివృద్ధిలో శానిటేషన్ సిబ్బంది చేసే సేవలు ఎప్పటికీ చిరస్మరణీయంగా నిలిచిపోతాయి అన్నారు. శానిటేషన్ సిబ్బందికి ఏ కష్టం వచ్చినా ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంతో పాటు మనందరిపై కూడా ఉంది అన్నారు. ప్రతినిత్యం ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే విధంగా పనిచేసే శానిటేషన్ సిబ్బందికి అవసరమైన పరికరాలు ఏర్పాటు చేయుటలో ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు, వివిధ సేవా సంస్థలు కూడా ముందుకు వచ్చి శానిటేషన్ సిబ్బందికి ఆరోగ్య సమస్యలపై అవగాహన కూడా కల్పిస్తూ శానిటేషన్ సిబ్బంది కి మనమందరం అండగా నిలవాలి అన్నారు. నాగార్జున పబ్లిక్ స్కూల్ సహకారంతో 45వ డివిజన్ సచివాలయ శానిటేషన్ సిబ్బందికి ఉపయోగపడే విధంగా డివిజన్ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్,
పి. వి. ఫణి కుమార్ సూచనలతో గ్లౌజులు, టోపీలు అందజేయడమైనది అన్నారు.ఈ కార్యక్రమంలో 45 డివిజన్ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్, పి. వి. ఫణి కుమార్, 45వ డివిజన్ సచివాల అడ్మిన్, షేక్ అల్లాబక్షు, డివిజన్ శానిటేషన్ సచివాలయ సెక్రెటరీ, మాచవరపు మానస, డివిజన్ శానిటేషన్ మేస్త్రి, బట్రాజు రామ శేఖర్, తదితర సచివాలయ శానిటేషన్ వర్కర్లు పాల్గొన్నారు

## గ్రామాల్లో అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

### - కొత్తపేట ఎమ్మెల్యే సత్యానందరావు

కొత్తపేట, మార్చి 27, (తెలుగురాష్ట్రం ప్రతినిధి):



గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరిగతిన పూర్తి చేయాలని, అలాగే గ్రామాల్లో అవసరమైన అభివృద్ధి పనులను గుర్తించి వాటిని త్వరితగతిన ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అధికారులను ఆదేశించారు. కొత్తపేట మండలం వాడపాలెంలోని తన కార్యాలయంలో గురువారం నియోజకవర్గంలోని కొత్తపేట, రావులపాలెం, ఆత్రేయపురం, ఆలమూరు మండలాల ఎంపీడీవోలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వేసవి కాలంలో తాగునీటి సమస్య లేకుండా చూసుకోవాలని సూచించారు.

### వచ్చే మే నెల 1 వ తేదీ నాటికి కృష్ణా జిల్లాను మొట్టమొదటి నాటు సారా రహిత జిల్లాగా ప్రకటించేందుకు సమన్వయంతో కృషి చేయాలి

## - రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర



కృష్ణ జిల్లా మచిలీపట్నం : మార్చి 27 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

వచ్చే మే నెల 1 వ తేదీ నాటికి కృష్ణా జిల్లాను మొట్టమొదటి నాటు సారా రహిత జిల్లాగా ప్రకటించేందుకు సమన్వయంతో కృషి చేయాలని రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అధికారులను ఆదేశించారు. గురువారం నగరంలోని కలెక్టరేట్ మీకోసం సమావేశ మందిరంలో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో నవోదయం 2.0 - నాటు సారా నిర్మూలన కార్యక్రమం పై జిల్లా సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాష్ట్ర గనులు భూగర్భవనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నాటు సారా పై ప్రజల్లో అవగాహన కలిగించి రాష్ట్రంలో నాటు సారాను నిర్మూలించడానికి నవోదయం కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామాలు, పట్టణాల్లో అవగాహన సదస్సులు ప్రచార కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించి నాటు సారా వినియోగం వల్ల కలిగే అనారోగ్య సమస్యలు, సామాజిక ఆర్థిక దుష్ప్రభావాలను వివరించడంలో సహాయం అందించడమే కాకుండా నాటు సారాను సేవించడం వల్ల కలిగే ప్రమాదాలపై ప్రజలలో అవగాహన పెంచి నాటు సారా రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం అమలు చేస్తున్నామన్నారు.ఇందులో భాగంగా ఎక్సైజ్, పోలీసు, రెవెన్యూ అధికారులు అందరూ కలిసికట్టుగా కృషిచేసి వచ్చే మే నెల ఒకటో తేదీ నాటికి జిల్లాను నాటు సారా రహిత జిల్లాగా ప్రకటించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.2016లో నవోదయం చేపట్టినప్పుడు ఎక్సైజ్ మంత్రిగా తాను 13 జిల్లాలకు గాను 11 జిల్లాలను నాటు సారా రహిత జిల్లాలుగా ప్రకటించడం జరిగిందన్నారు. తదుపరి ఎక్సైజ్ డిపార్ట్మెంట్లో ఎన్ఫోర్స్మెంట్ లేదని, రాష్ట్రం ఆదాయం లేక బాగా నష్టపోయిందన్నారు. ప్రజలు అనారోగ్యం పాలయ్యారన్నారు. 2019 మొదట్లో తెలంగాణకు మనకు ఎక్సైజ్ ఆదాయంలో 4 వేల కోట్ల రూపాయల తేడా ఉండేదని, అదే 2024 లో చూస్తే 40 వేల కోట్ల రూపాయల తేడా ఉందన్నారు. తమ ప్రభుత్వం వచ్చాక ఎక్సైజ్ శాఖలో అధికారులు సిబ్బందిచే నిర్మాణాత్మకంగా పనిచేయిస్తున్నామన్నారు. నాటు సారా తయారీలో మురికి కుంటల నీరు, పనికిరాని నల్ల బెల్లం, యూరియా ,చెత్త, మట్టి కలిపి ఉపయోగిస్తారని స్పష్టంగా ప్రజలకు వివరించాలని సూచించారు.నాటు సారా సారా కాచే వారిని గుర్తించి ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ కార్పొరేషన్ల ద్వారా, సిఎస్ఆర్ నిధుల ద్వారా వారిని ఆదుకోవడం జరుగుతుందన్నారు. ఈసారి బడ్జెట్లో నవోదయం కార్యక్రమానికి 10 కోట్ల రూపాయలను కేటాయించడం జరిగిందన్నారు గంజాయి నిర్మూలనకుపై కూడా చాలా సీరియస్ గా చర్యలు తీసుకోవాలని అన్నారుమచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రిలో ఒక డి అడిక్షన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ మాట్లాడుతూ నవోదయం కార్యక్రమం పై ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను తప్పనిసరిగా అమలు చేయాలన్నారు.గ్రామాల్లో నాటుసారా కాచిన, అమ్మిన తీవ్రమైన నేరంగా పరిగణించాలని ఎక్కడ ఎవరు కాస్తున్నారు, ఎవరు అమ్ముతున్నారు నిఘా ఉంచి ఏ బి సి కేటగిరీలోని వారిని గుర్తించి వారిపై తగిన విధంగా చర్యలు తీసుకోవాలన్నారు .అవసరమైతే పి.డి. చట్టాన్ని కూడా జాగ్రత్తగా బనాయించాలన్నారు. ఇందుకోసం సచివాలయం, అంగనవాడి, ఏఎన్ఎం తదితర సిబ్బంది సేవలను కూడా వినియోగించుకోవాలన్నారు.జిల్లా పోలీసు అధికారి ఆర్ గంగాధర్ రావు మాట్లాడుతూ నాటు సారా నిర్మూలనకు పోలీస్ శాఖ పరంగా సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు.జిల్లాలో 8 డ్రోన్లు అందుబాటులో ఉన్నాయని వాటిని మారుమూల ప్రాంతాల్లో ఎవరు ఎక్కడ నాటు సారా కాచిన తెలుసుకునే విధంగా వినియోగంలోకి తెచ్చామన్నారు జిల్లాలో 200 కేసులు పట్టుకున్నామని అక్రమంగా తరలిస్తున్న మందు సీసాలను నాశనం చేసేందుకు ఉన్నతాధికారుల అనుమతి కోరామని, అనుమతి రాగానే వాటిని నాశనం చేస్తామని మంత్రికి వివరించారుఅంతకు మునుపు ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ కృష్ణాజిల్లాలో 14 గ్రామాల్లో సారా నాటు సారా కాశి అమ్ముతున్నట్లు గుర్తించామని వాటిని ఏబీసీ కేటగిరీలుగా విభజించామని ముఖ్యంగా మచిలీపట్నం పెడన, గూడూరు, బంటుమిల్లి, గన్నవరం మండలాల్లో సారా కాచి అమ్ముతున్నట్లు గుర్తించామని, ఇప్పటివరకు 129 కేసులు బనాయించి 73 మందిని అరెస్టు చేశామని, నాటు సారా సమాచారం అందించేందుకు టోల్ ఫ్రీ నెంబర్ 14405 ఫోన్ చేసి చెప్పాలని కోరుతున్నట్లు వివరించారు.ఈ సందర్భంగా మంత్రివర్యులు, జిల్లా కలెక్టర్ అధికారులు తో కలసి ఎక్సైజ్ శాఖ రూపొందించిన గోడ పత్రాలు, కరపత్రాలు ఆవిష్కరించారు.అనంతరం గుడివాడకు చెందిన కళాభారతి వీరయ్య ప్రశాంత్ , తేజ కళాజాత బృందం నాటు సారా తాగడం వల్ల కలిగే దుష్ప్రభావాలను వివరించింది. తదనంతరం మంత్రివర్యులు నాటు సారా వల్ల కలిగే దుష్ఫలితాలను తెలియజేసే ప్రచార వాహనాన్ని ప్రారంభించారు.ఈ సమావేశంలో డిఆర్ఓ చంద్రశేఖర రావు, ఎక్సైజ్ శాఖ సహాయ కమిషనర్ శ్రీనివాస చౌదరి, సూపరింటెండెంట్ గంగాధర్ రావు, సహాయ సూపరింటెండెంట్ భార్గవ్, మచిలీపట్నం, ఉయ్యూరు ఆర్డిఓలు స్వాతి, హేలాషరూన్ డి ఆర్ డి ఏ, డ్వామా పీడీలు హరిహరనాథ్, శివప్రసాద్ డిఎస్పి సిహెచ్ రాజా పలువురు ఎక్సైజ్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

### సామాజిక స్పృహతో మెగాభిమానులు సేవా కార్యక్రమాలు

## - భీమవరంలో రామ్ చరణ్ పుట్టినరోజు సందర్బంగా రక్తదాన శిబిరం

భీమవరం మార్చి 27, (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



సామాజిక స్పృహతో మెగాభిమానులు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అఖిల భారత చిరంజీవి యువత రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉండపల్లి రమేష్ నాయుడు అన్నారు. సినీనటులు మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ పుట్టినరోజు సందర్బంగా మెగా ఫ్యాన్స్ ఆధ్వర్యంలో ఉచిత మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. రమేష్ నాయుడు మాట్లాడుతూ ఆర్ఆర్ఆర్ సినిమాలో రాంచరణ్ నటన కారణంగా విదేశాల్లో సైతం అభిమానులను సంపాదించుకున్నారని, రాంచరణ్ మగధీర, రంగస్థలం వంటి సినిమాల్లో తనదైన నటనతో అలరించారని, చిరంజీవి తనయుడిగా సినీ అరంగేట్రం చేసిన రాంచరణ్ సమాజ సేవ గుర్తు చేసేలా ప్రతి సినిమాలో ఓ మెసేజ్ ఇస్తూ వస్తున్నారని అన్నారు. టౌన్ వైడ్ మెగా ఫాన్స్ అధ్యక్షుడు చల్లా రాము మాట్లాడుతూ రామ్ చరణ్ తన నటన తో దక్షిణాది రాష్ట్రాల్లో తండ్రికి తగ్గ తనయుడిగా పేరు ప్రఖ్యాతలు సంపాదించుకున్నారని, భవిష్యత్తులో మరిన్ని మంచి చిత్రాల విజయాలతో ముందుకు వెళ్లాలన్నారు. అనంతరం 50 మంది మెగా అభిమానులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో యాసా అనిల్, కెవిఎల్ నర్సింహారావు, కె వరం, కొప్పినీడి బాబి, కొప్పర్తి కోటి, తోట శేషు, యడ్లపల్లి రాంబాబు, చింతా లక్ష్మణ్, నాగిడి శ్యామ్, మునగాల సంజయ్, రాట్నాల శ్రీనివాసరావు, పితాని కృష్ణ, జాడ చిన్న, కోటిపల్లి చరణ్ తదితరులు పాల్గొన్నారు.

# సాంప్రదాయ నాణ్యమైన వస్త్రాలకు కేరాఫ్ మినిస్టర్ వైట్


## - భీమవరంలో మినిస్టర్ వైట్ షోరూంను ప్రారంభించిన ఎమ్మెల్యే అంజిబాబు



భీమవరం మార్చి 27, (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

సాంప్రదాయ నాణ్యమైన స్వదేశీ వస్త్రాలకు కేరాఫ్ మినిస్టర్ వైట్ అని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం పిపి రోడ్ లో మినిస్టర్ వైట్ షోరూంను గురువారం ఎమ్మెల్యే అంజిబాబు ప్రారంభించి మాట్లాడారు. సరసమైన ధరల్లో నాణ్యమైన ధోతీలు, షర్టులు ఒకేచోట లభించడం సంతోషదాయకమన్నారు. మినిస్టర్ వైట్ కంపెనీ సిబిఓ సురేష్ రామ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ భారతదేశం వ్యాప్తంగా 40 షోరూం లున్నాయి, ఆంధ్రప్రదేశ్ లో తిరుపతి, తణుకు, కాకినాడ, విజయనగరం, పలాస లతోపాటు భీమవరంలో 6వ షోరూమ్ ప్రారంభించామని, త్వరలో తెలంగాణలో రెండు షోరూంలను ప్రారంభిస్తామన్నారు. తెల్ల షర్టులు, కలర్ షర్టులు సిల్క్, లినెన్ షర్టులు మా ప్రత్యేకత అని, ఒకటో సంవత్సరం పిల్లల దగ్గర నుంచి 16వ సంవత్సరం పిల్లల వరకు అన్ని రకాల ఉత్పత్తులు లభిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఆశిష్, కిషోర్, ఆంధ్ర ఏరియా సేల్స్ మేనేజర్ జహిరుద్దీన్, బండి రమేష్ కుమార్, వబిలిశెట్టి రామకృష్ణ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# క్రైస్తవ నాయకుడు ప్రవీణ్ మరణం క్రైస్తవ లోకానికి విషాదకరం.. మేడిది జాన్సన్



భీమవరం మార్చి 27, (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

రాజమహేంద్రవరంలో క్రైస్తవ నాయకుడు ప్రవీణ్ పగడాల ఆకస్మిక మరణం క్రైస్తవ లోకానికి విషాదకరమని ఏపీ పాస్టర్స్ ఫెలోషిప్ రాష్ట్ర అధ్యక్షుడు మేడిది జాన్సన్ అన్నారు. బుధవారం భీమవరంలోని బ్రౌనింగ్ విద్యాసంస్థల ఆవరణలో వెస్ట్ గోదావరి పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో సమావేశమైన పలువురు పాస్టర్లు మాట్లాడారు. ప్రవీణ్ మృతికి సంతాపం తెలిపారు. ఆయన మృతిపై సమగ్ర విచారణ చేసి క్రైస్తవులకు తగిన న్యాయం చేయాలని కోరారు. నిత్యం దేవుని సేవలో ప్రయాణాలు చేస్తున్న సేవకులు ప్రయాణ వేళల్లో జాగ్రత్తగా వెళ్లాలని పాస్టర్ల ఫెలోషిప్ ప్రతినిధులు సూచించారు. ఫెలోషిప్ జిల్లా సెక్రటరీ బిషప్ జొహనాస్ ప్రేమ్ మార్, కోశాధికారి రాపాక రత్నరాజు, యూపీఏ భీమవరం ప్రెసిడెంట్ ఆర్ ప్రభాకర్రావు, శ్యాంబాబు, ఏలూరి జాన్ మోజేస్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్దే లక్ష్యంగా పని చేస్తున్నాం

## - భీమవరం పట్టణంలో సుమారు రూ కోటి లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే అంజిబాబు



భీమవరం మార్చి 27, (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

భీమవరం నియోజక వర్గం అభివృద్దే లక్ష్యంగా పని చేస్తున్నామని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం పట్టణంలోని 5 వార్డులలో సుమారు రూ కోటి 2 లక్షలతో సీసీ రోడ్లు, డ్రెయినేజీలకు గురువారం ఎమ్మెల్యే అంజిబాబు, రాజ్యసభ మాజీ సభ్యురాలు తోట సీతారామలక్ష్మి శంకుస్థాపనలు చేశారు. ముందుగా 34వ వార్డులో రూ 19 లక్షలతో సీసీ రోడ్డు, డ్రైన్, 35వ వార్డు వంశీకృష్ణ నగర్లో 29.02 లక్షలతో సీసీ డ్రైన్, 36వ వార్డులో రూ 10 లక్షలతో సీసీ రోడ్డు, 37వ వార్డులో రూ 34 లక్షలతో సీసీ రోడ్డు, సీసీ డ్రెయిన్, 39వ వార్డు బైపాస్ రోడ్డులో రూ 10.10 లక్షలతో బీటీ రోడ్డుకు ఎమ్మెల్యే అంజిబాబు శంకుస్థాపన చేశారు. పట్టణంలోని అన్ని వార్డులోను సీసీ రోడ్లు, డ్రెయిన్లు అభివృద్ధి చేస్తున్నామని, మోడరన్ నియోజక వర్గంగా భీమవరాన్ని అభివృద్ధి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర నాయకులు మెంటే పార్థసారథి, కోళ్ల నాగేశ్వర్రావు, జనసేన పట్టణ అధ్యక్షుడు చెనమల్ల చంద్రశేఖర్, బండి రమేష్, వబిలిశెట్టి రామకృష్ణ, ముదునూరి సూర్యనారాయణ రాజు, ఇందుకూరి రామలింగరాజు, పత్తి హరివర్ధన్, యర్రంశెట్టి శివకృష్ణ, మెరగాని నారాయణమ్మ, గంటా త్రిమూర్తులు, ఉప్పులూరి చంద్రశేఖర్, పెన్మెత్స సత్యనారాయణ రాజు, కలిదిండి రామకృష్ణంరాజు, రమణరాజు, గాదిరాజు సూర్యనారాయణ రాజు, ఇందుకూరి నాగరాజు, కలిదిండి గోపాలకృష్ణంరాజు, డిజికె, రాజు, కొప్పినీడి బాబీ, పివిటి అప్పలరాజు, బాలాజీ రాజు, టిడిపి జనసేన బిజెపి నాయకులు, వార్డు పెద్దలు, ఇన్ ఛార్జ్ లు, కార్యకర్తలు, అభిమానులు వీర మహిళలు పాల్గొన్నారు.

### కార్యకర్తే అధినేత.. ఇదే తెలుగుదేశం పార్టీ నినాదం

## - కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే సత్యానందరావు



రావులపాలెం, మార్చి 27, (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

కార్యకర్తే అధినేత అనేది తెలుగుదేశం పార్టీ నినాదం అని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం టీడీపీ క్యాంపు కార్యాలయం వద్ద బుధవారం ఆయన కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అధిష్టానం ఇచ్చిన మాట మేరకు కార్యకర్తే అధినేత అనే నినాదాన్ని ఆచరణలో పెట్టేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగానే ప్రతి బుధవారం పార్టీ శ్రేణులతో సమావేశాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యకర్తే అధినేత అనే మాటలను తెలుగుదేశం పార్టీ ఆచరణలో పెడుతోందని ఇకపై ప్రతి కార్యకర్తను కలిసి సమస్యలు పరిష్కరించాలని పార్టీ అధినేత చంద్రబాబు, ప్రధాన కార్యదర్శి లోకేష్ సంచలన నిర్ణయం తీసుకున్నారన్నారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు అండగా నిలిచిన కార్యకర్తలే తెలుగుదేశం పార్టీకి బలమని దేశంలో ఏ పార్టీకి లేని సంస్థాగత నిర్మాణం తెలుగుదేశానికి ఉందని అన్నారు. ఇటీవల కోటి సభ్యత్వాలతో చరిత్ర సృష్టించి అతి పెద్ద కుటుంబంగా మారిన నేపథ్యంలో కార్యకర్తే అధినేత అని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పిలుపునిచ్చారని చెప్పారు. ఈ మేరకు అన్ని నియోజకవర్గాల్లో ప్రతి బుధవారం ఎమ్మెల్యేలు, ఇన్ఛార్జులు కార్యకర్తలతో సమావేశం నిర్వహించి వారికి అండగా నిలుస్తామని సమస్యలు పరిష్కరించాలని పార్టీ నాయకులు, శ్రేణులకు ఆదేశాలు జారీ చేశారని వివరించారు. క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్ఛార్జులతో పాటు బాబు షఉ్యరిటీ-భవిష్యత్ కు గ్యారెంటీ ఫీల్డ్ వర్క్, శంఖారావం ఫీల్డ్ వర్క్, ఓటర్ వెరిఫికేషన్, పార్టీ యాప్స్, సభ్యత్వ నమోదులో ఉత్తమ పనితీరు కనబరిచిన కార్యకర్తలను మరోసారి అభినందించారు. చంద్రబాబు ఆదేశాల మేరకు అన్ని నియోజకవర్గాల్లో ఇన్ఛార్జులు, ఎమ్మెల్యేలు ప్రతి బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నియోజకవర్గ ప్రజల నుంచి ప్రజాదర్బార్ లో వినతులు స్వీకరిస్తామని తెలిపారు. మధ్యాహ్నం నుంచి నియోజకవర్గ స్థాయిలో కార్యకర్తల సమావేశం నిర్వహించి వారి సమస్యలను పరిష్కరించడంతో పాటు ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు. ప్రతీ కార్యకర్తను అన్ని విధాలా ఆదుకునేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే సత్యానందరావు తెలిపారు. తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కె.వి.సత్యనారాయణరెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు గుత్తుల పట్టాభి రామారావు, కంఠంశెట్టి శ్రీనివాసరావు, ముదునూరి వెంకటరాజు, మెర్ల గోపాలం, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అరటి కార్మికులకు ఉచిత బీమా సౌకర్యం

## - కార్మిక శాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ నాగలక్ష్మి

## - నమోదు ప్రక్రియ ప్రారంభించిన అధికారులు



రావులపాలెం, మార్చి 27, (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

అరటి కార్మికులు కేంద్ర ప్రభుత్వం అసంఘటిత కార్మికులకు అందిస్తున్న ఉచిత భీమా సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని అంబేద్కర్ కోనసీమ జిల్లా కార్మిక శాఖ అసిస్టెంట్ కమీషనర్ నాగలక్ష్మి, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి కె. విశాలాక్షి సూచించారు. రావులపాలెం అరటి మార్కెట్ యార్డులోని రైతు విశ్రాంతి భవనంలో గురువారం వారి పర్యవేక్షణలో అసంఘటిత కార్మికులకు ఉచిత బీమా నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి ఐ.రమేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ రావులపాలెం మార్కెట్ యార్డులో పనిచేస్తున్న అరటి ఎగుమతి, ప్యాకింగ్ జట్టు కార్మికులకు ఉచిత భీమా సౌకర్యం ఏర్పాటు చేయాలనే ఉద్దేశ్యంతో కేంద్ర కార్మిక శాఖ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేసామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుమారు 150 మంది కార్మికులు పాల్గొనగా వారికి ఉచిత బీమా సౌకర్యం గురించి అవగాహన కల్పించారు. అప్పటికప్పుడు 16 మంది కార్మికులకు ఆన్ లైన్ లో బీమా వర్తించే విధంగా నమోదు చేసి కార్డులు పంపిణీ చేశారు. యార్డులోని కార్మికులందరికీ ఉగాది లోగా కార్డులు అందజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు సిబ్బంది వి.శ్రీనివాసు, జి.బి.వి.ప్రసాదు, జె. అలేఖ్య, మార్కెట్ యార్డు సిబ్బంది పాల్గొన్నారు.

# కొత్తపేట ఉప సర్పంచ్ గా విళ్ల మారుతి

## - అభినందించిన ఎమ్మెల్యే బండారు

కొత్తపేట, మార్చి 27, (తెలుగురాష్ట్రం ప్రతినిధి):



కొత్తపేట గ్రామ పంచాయితీ నూతన ఉప సర్పంచ్ గా విళ్ల మారుతీ ప్రసాద్ ఎన్నికయ్యారు. గురువారం గ్రామ సర్పంచ్ బూసి జయలక్ష్మి అధ్యక్షతన పంచాయతీ వార్డు సభ్యులు సమావేశమై ఉప సర్పంచ్ ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమానికి కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ముఖ్య అతిథిగా హాజరై ఆయనను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ పాలక మండలి సభ్యులంతా కలిసికట్టుగా పని చేసి ప్రజల సమస్యల పరిష్కారానికి, గ్రామ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కంఠంశెట్టి శ్రీనివాస్, బూసి భాస్కరరావు, బండారు బుల్లితాత, మిద్దే ఆదినారాయణ, ధరణాల రామకృష్ణ, బీర ఇస్సాక్, వాసంశెట్టి సత్యనారాయణ, పంచాయతీ వార్డు సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మచిలీపట్నంలో మొదటి జువెలరీ మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షో రూం ప్రారంభించిన మంత్రి కొల్లు రవీంద్ర




మచిలీపట్నం: మార్చి 27, (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

– దేశంలో 300కి పైగా, ఏపీలో 19వ షోరూం బందరులో ప్రారంభించడం సంతోషంగా ఉంది అన్నారు రాష్ట్రగనులు భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర స్థానిక రాజా గారి సెంటర్లో జూలరీ ప్రారంభోత్సవం అనంతరం మాట్లాడుతూ ఒకప్పుడు బంగారం కొని వస్తువులు తయారు చేసేవారునేడు ట్రెండ్ మారింది. నచ్చిన స్టైల్ కొనుక్కుంటున్నాం బంగారం అనేది మన సంస్కృతిలో ఒక భాగం, ఒక ఆస్తి గోల్డ్ కవరింగ్ కు బందరు ప్రసిద్ధి.. ఇకపై బంగారు ఆభరణాలకు కేంద్రంగా మారబోతోందిఆభరణాల తయారీలో నిష్ణాతులైన వ్యక్తులున్నారు.వారి నైపుణ్యాన్ని బంగారు ఆభరణాల తయారీలో వినియోగించుకుని ముందుకు వెళ్లాలని కోరుకుంటున్నాను.5% ఆదాయం సీఎస్ఆర్ కోసం మలబార్ సంస్థలు కేటాయించడం అభినందనీయం మన్నారు ఈ సందర్భంగా బందర్ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని నిర్వాహకులను కోరారు. ఈ కార్యక్రమంలో మచిలీపట్నం నగరపాలక సంస్థ మేయర్ వెంకటేశ్వరమ్మ, జనసేన పార్టీ బందరి ఇంచార్జ్ బండి రామకృష్ణ, మాజీ మున్సిపల్ చైర్మన్ బాబా వెంకటప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

## మురమళ్ళ శ్రీ వీరేశ్వరస్వామి వారి హుండీ లెక్కింపు



ఐ.పోలవరం మార్చి 27, (తెలుగురాష్ట్రం ప్రతినిధి):

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం మురమళ్ళ గ్రామంలో శ్రీ భద్రకాళీ వీరేశ్వర స్వామి ఆలయంలో దేవాదాయ శాఖ అధికారులు, అమలాపురం తనిఖీ అధికారి రామలింగేశ్వర రావు పర్యవేక్షణలో హుండీ ఆదాయం లెక్కింపు కార్యక్రమం జరిగింది. ఆలయ సిబ్బంది, బ్యాంక్ సిబ్బంది, రెవెన్యూ, పోలీస్, గ్రామస్తులు పాల్గొన్నారు. ఆలయ అర్చకులు బ్రహ్మశ్రీ యనమండ్ల సుబ్బారావు హుండీలకు హారతి ఇచ్చి ప్రారంభించారు. 110 రోజులకు రూ. 15,73,843 వచ్చిందని, మూడు విదేశీ కరెన్సీ నోట్లు వచ్చాయని, ఆలయ కార్యనిర్మాధికారి మాచిరాజు లక్ష్మీనారాయణ తెలిపారు.

## వేమగిరిలో అంగన్వాడి భవనాలను ప్రారంభించిన ఎమ్మెల్యే గోరంట్ల



కడియం, మార్చి27(తెలుగురాష్ట్రం ప్రతినిధి)

కడియం మండలం వేమగిరి తోటలో నిర్మించిన రెండు అంగన్వాడీ కేంద్రాల భవనాలను రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి,ఎంపిపి వెలుగుబంటి వెంకట సత్య ప్రసాద్ తో కలిసి గురువారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వ పాలన సాగుతుందన్నారు. రూరల్ శాసనసభ్యులు శ్రీ గోరంట్ల బుచ్చయ్య చౌదరి పేర్కొన్నారు.ఈ గ్రామంలో రూ.25.50 లక్షలతో నూతనంగా నిర్మించిన అంగన్వాడి భవనాలను తీర్చిదిద్దిన అధికారులకు, ఇంజనీరింగ్ సిబ్బందికి, క్వాలిటీ వర్క్ అందించిన కాంట్రాక్టర్లకు అభినందించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అంగన్వాడి కేంద్రాలను మరింత పటిష్టం చేసే విధంగా ప్రణాళికతో ముందుకు వెళుతున్నామని, మొన్న జరిగిన అసెంబ్లీ సమావేశాలలో అంగన్వాడీ వర్కర్లకు జీతాలు పెంచేందుకు సీఎం హామీ ఇచ్చారని తెలిపారు.అంగన్వాడి వర్కర్లకు న్యాయం చేసే విధంగా కూటమి ప్రభుత్వం కార్యాచరణ రూపొందించిందన్నారు. మన ప్రభుత్వం వచ్చిన తరువాత పోతురాజు నగర్ లో ఆరు లక్షల రూపాయలతో సిసి రోడ్, డ్రైన్ నిర్మించామని, వినాయక గుడి వద్ద 15 లక్షల రూపాయలతో సీసీ రోడ్డు, డ్రైన్ నిర్మించామని, జక్కంపూడి నగర్ లో 10 లక్షల 50 వేల రూపాయలతో సీసీ రోడ్డు, డ్రైన్ నిర్మించామని, మొత్తం కలిపి 31.50 లక్షల రూపాయలు పనులు పూర్తి చేశామని, మరో 50 లక్షల రూపాయల పనులకు అంచనాలు సిద్ధం చేశామని త్వరలో పనులు మొదలు పెడతామని తెలిపారు. గ్రామంలో ముఖ్యంగా మురుగునీరు పోయేందుకు మెయిన్ డ్రైనేజీ ఏర్పాటు చేయాల్సి ఉందని త్వరలోనే వాటన్నిటిని పరిశీలించి డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐ.సి.డి.ఎస్ పీ.డీ కే.విజయ్ కుమారి, ఎం.పీ.డీ.వో కె.రమేష్, రాష్ట్ర నాయకులు చెల్లుబోయిన శ్రీనివాస్, మార్గాని సత్యనారాయణ, సి.డి.పి.ఓ టి.నాగమణి, టీ.కనకవల్లి,పంచాయతీ కార్యదర్శి రూప్ చంద్, గుత్తుల కృష్ణ, యనమదాల రాజు, వాసంశెట్టి బాలాజీ, సురపరెడ్డి జానకిరామయ్య, పోలా శ్రీను, సుంకర గోపాలకృష్ణ, కాంగ్రేగుల సత్తిబాబు, అప్పారి అన్నవరం, జోగి చక్రవర్తి, కొప్పిశెట్టి నాగేశ్వరరావు, దంగేటి శ్రావణ్, వాసంశెట్టి రమణ, గుత్తుల శేషగిరి, బొల్లాడి జాన్, ఈతకోట రాజ్ కుమార్, అంగన్వాడి సూపర్వైజర్లు, టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

## చింతలు తీర్చే అమ్మ.. చింతలూరు నూకాలమ్మ

## -ఈనెల 28న జాతర మహోత్సవం-29 నుండి నెలరోజుల తీర్ధ మహోత్సవం



ఆలమూరు, మార్చి27(తెలుగురాష్ట్రం ప్రతినిధి)

చంటిపిల్లల బాలారిష్ట సంరక్షణి చింతలూరు నూకాంబికా అమ్మణి తుళ్ళు బిళ్ల – వారపోతల స్వీకారిణి భక్తజనుల పాలిట అమృత వర్షిణిచింతల తీర్చే అమ్మ.. చింతలూరు నూకాలమ్మగా ఉమ్మడి గోదావరి జిల్లాల్లో ప్రసిద్ధి చెందిన అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం చింతలూరు శ్రీ నూకంబికా అమ్మవారి జాతర మహోత్సవం ఈనెల 28న అత్యంత వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే 29న తీర్థ మహోత్సవం, 30న ఉగాది ఉత్సవాలు ఈ ఆలయం వద్ద కన్నులపండువగా జరగనున్నాయి. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ఆర్డీవో పి. శ్రీకర్,డిఎస్పీ సుంకర మురళీ మోహన్ ల ఆధ్వర్యంలో పలు సమీక్ష సమావేశాలు నిర్వహించి భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. చంటి పిల్లలకు వచ్చే పొంగు, ఆటలమ్మ వంటి వ్యాధులు దరిచేరకుండా ఈ అమ్మవారు అనుగ్రహిస్తారని భక్తుల విశ్వాసం. అందుకనే ఈ అమ్మవారి దర్శనానికి చంటి పిల్లలతో తల్లిదండ్రులు అధిక సంఖ్యలో ఇక్కడకు తరలి వస్తారు.చంటి పిల్లలతో ఇంత అధిక సంఖ్యలో ఉత్సవాలకు రావడం గోదావరి జిల్లాలలోనే కాదు కోస్తా జిల్లాలలో ఎక్కడా మరో ఆలయం ఉండదనే చెప్పాలి.నెల రోజుల పాటు ఈ అమ్మవారి తీర్ధమహోత్సం జరుగుతుంది. అమ్మవారిని దర్శించుకుని కానుకలు మొక్కబడలు తీర్చుకోవడమే గాక వారపోత, తుళ్లిబిళ్ళ, కావిడి కోళ్లు, గండా దీపం వంటివి ఈ ఆలయంలో భక్తులు ప్రత్యేకంగా చేయడం ఎన్నో దశాబ్దాలుగా వస్తున్న ఆచారం.రెండున్నర శతాబ్దాల ఆలయ చరిత్ర నూకాంబికా అమ్మవారి ఆలయానికి రెండున్నర శతాబ్దాల చరిత్ర ఉంది. అసలు విగ్రహ ప్రతిష్ఠ, ఆలయ నిర్మానానికే వినూత్న చరిత్ర ఉంది.పూర్వ కాలంలో ఆలయ నిర్మాణాన్ని తన మనోవాంఛ ప్రకారం అంటే అమ్మవారి విగ్రహాన్ని అరటి నారా ఊయలతో ఊపిన తర్వాత తన మూల విగ్రహం ఎక్కడ స్థిరంగా పడుతుందో ఆ స్థలంలో విగ్రహ ప్రతిష్ట తో పాటు ఆలయ నిర్మాణం జరిపించాల్సిందిగా అమ్మవారు ఆజ్ఞాపించినట్లు చరిత్ర చెబుతుంది. ఆ ప్రకారం పిఠాపురం మహారాజు వారి ఆర్థిక సహాయంతో ఈ ఆలయాన్ని నిర్మించినట్లు ఆలయ చరిత్రలో పేర్కొన్నారు. అలాగే ఈ అమ్మవారు చింతలూరు వంశపు వారి ఆడపడుచు గాను ఆ చింతలూరు ఇంటిపేరు ఆ గ్రామం పేరుగా రూపాంతరం చెందినట్లు కూడా తెలపబడుచున్నది. అందుకనే ప్రతి ఏటా వార్షిక జాతర మహోత్సవ సందర్భంగా పాల్గొన మాసం శుద్ధ విదియనాడు మధ్యాహ్నం శ్రీ అమ్మవారి బుట్ట గరగ ఎత్తు మహోత్సవం ప్రారంభమై 15 రోజులు పరిసర గ్రామాలలో సంచరించి పౌర్ణమి తిధి నాడు రాత్రి నుండి మోదుగు పూలతో అలంకరించి కొత్త పూల సంబరం, పాత పూల సంబరాలు రోజు విడిచి రోజు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమాలను తొలుత చింతలూరు పూర్ణచంద్ర ప్రభాకర రావు ఇంటి వద్ద మోదుగు పూల గరగ నివాళులు తీసుకొనుట అలాగే ప్రధాన జాతరనాటి రాత్రి ప్రథమ మొక్కుబడి చింతలూరు సత్యనారాయణ (కరణం) ఇంటిలో కొలవడం ఆచారంగా వస్తుంది. జాతర్లకే జాతర చింతలూరు నూకాలమ్మ జాతర గ్రామదేవతలకు జాతర నిర్వహించడం మనకు తెలిసిందే.కానీ చింతలూరు నూకాలమ్మ జాతర అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతుంటారు.తెల్లవార్లూ శరీరం గగుర్పాటు కల్పించే రీతిలో వేలాదిమంది భక్తులు సమక్షంలో, బాణాసంచా కాల్పులు, కళ్లు చెదిరే విద్యుత్ అలంకరణ మధ్య కొనసాగే ఈ జాతరను చూడడానికి రెండు కళ్ళు చాలవంటే అతిశయోక్తి కాదు. అంత రంగ రంగ వైభవంగా జాతర జరుగుతుంది. ఆ మన్నాడు తీర్థ మహోత్సవం కూడా మామూలుగా ఉండదు. పెద్ద ఎత్తున భక్తులు తీర్థ మహోత్సవంలో పాల్గొంటారు. ఇక ఉగాది ఉత్సవాలు ఇక్కడ చాలా ప్రత్యేకతను సంతరించుకుంటాయి. ఎందుకంటే ఆ రోజున అందరూ ఉగాది వేడుకలు తమ ఇంటి వద్ద జరుపుకుంటారు. కాని చింతలూరు పరిసర ప్రాంతాల ప్రజలంతా ఈ ఆలయం వద్దే ఉగాది సందడి చేసుకుంటారు. దూర ప్రాంతాల్లో ఉద్యోగ,వ్యాపార రీత్యా స్థిరపడిన వారంతా సంక్రాంతికి వచ్చినా రాకపోయినా ఈ ఉగాదినాడు కయచ్చితంగా వచ్చి బంధుమిత్రులు తో ఎంతో ఆనందంగా గడుపుతారు. అందుకనే ఈ ప్రాంతంలో ఉగాదికి అంత స్పెషల్ ఉంటుంది. ఆలమూరు మండలం తో పాటు మండపేట, కపిలేశ్వరపురం, రావులపాలెం, కడియం మండలాల ప్రజలు ఈ అమ్మవారిని ఆరాధ్య దైవంగా కొలుస్తూ వస్తున్నారు. ఇంటిల్లపాది ఈ అమ్మవారి దర్శనానికి తరలి వస్తారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం రావులపాలెం, రామచంద్రపురం ఆర్టీసీ డిపోల వారు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసారు. ఆర్టీసీ బస్సులు అంతగా లేని రోజుల్లో ప్రైవేటు సిటీ బస్సులను ప్రత్యేకంగా ఏ ప్రాంతాలకు తిప్పేవారు. ఆ సిటీ బస్సులు కూడా లేని రోజుల్లో ఎడ్లబళ్లు, గుర్రం బండ్లు, రిక్షాలు, సైకిళ్లపై చింతలూరు అమ్మవారి ఆలయానికి తరలివచ్చేవారు.అలా వచ్చి ఇలా వెళ్లిపోకుండా ఇక్కడే వంట వార్పులతో రెండు మూడు రోజులు ఉండి వెళ్లేవారు. చివరిగా ఈ అమ్మవారి మహత్యం ఏమిటంటే ఉత్సవాలు సందర్భంగా ఆలయానికి వచ్చే ఆదాయంలో చాలామంది కక్కుర్తి పడుతుంటారు. ఎన్నో దశాబ్దాల నుంచి చేతివాటం ప్రదర్శించే వారంతా గుడి చుట్టూనే తిరుగుతారు తప్ప ఎక్కడ ఎదుగూబొదుగు ఉండదు. ఇది అమ్మవారి శాపంగా పేర్కొంటారు. ఈ అమ్మవారి ఆలయ ఆదాయానికి గండి కొట్టే వారు ఎవరూ ఆర్థికంగానూ.. కుటుంబం పరంగాను బాగుపడిన దాఖలు లేవని స్థానికులు చెబుతారు.ఎవరో చెప్పడం కాదు అక్కడ అదే జరుగుతుందనడానికి నిదర్శనం ఎన్నో సంవత్సరాల నుంచి అమ్మవారికి వచ్చే ఆదాయాన్ని కాస్తాకూస్తో తిన్నవారు ఏళ్ల తరబడి ఆ ఆలయం వద్ద సంచరించడం మినహా తనకంటూ ఓ స్థాయి పొందలేకపోతున్నారు.ఇటువంటి అమ్మవారి శాపం అధికారులకు,ఉద్యోగులకు కూడా తగిలింది. కాని అమ్మవారు మాత్రం దినదినాభివృద్ధి చెందుతూ కోట్లాది రూపాయలతో ఆలయ అభివృద్ధి చెందడమే గాక లక్షాధిమంది భక్తుల ఆదరణ పొందగలుగుతున్నారు.

## మచిలీపట్నంలో 'మలబార్ గోల్డ్ ' షోరూమ్ ను లాంఛనంగా ప్రారంభించిన మంత్రి కొల్లు రవీంద్ర



కృష్ణ జిల్ల మచిలీపట్నం : మార్చి 27 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఇప్పటి వరకు రోల్డ్ గోల్డ్ పరిశ్రమకు ప్రసిద్ధిగా ఉన్న మచిలీపట్నం మలబార్ షోరూమ్ ప్రారంభంతో మేలిమి బంగారానికి కూడా ప్రసిద్ధిగా మారబోతుందని రాష్ట్ర గనులు, భూగర్భవనరులు మరియు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. స్థానిక రాజా గారి సెంటర్ లో నూతనంగా ఏర్పాటు చేసిన మలబార్ గోల్డ్ %డ% డైమెండ్స్ షోరూమ్ ను గురువారం ఆయన ప్రారంభించారు. షోరూమ్ లో గోల్డ్ కొనుగోలు చేసిన తొలి ఐదు మంది కస్టమర్లకు మంత్రి రవీంద్ర చేతుల మీదుగా అభరణాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి రవీంద్ర మాట్లాడుతూ పోర్టు సిటీగా అభివృద్ధి చెందుతున్న మచిలీపట్నంలో మలబార్ షోరూమ్ ను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. దేశంలో 300కి పైగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో 42 పై షోరూమ్ లు కలిగిన మలబార్ సంస్థ మన రాష్ట్రంలో 19వ షోరూమ్ ను మచిలీపట్నంలో ప్రారంభించడం హర్షనీయమన్నారు. ఒకప్పుడు బంగారం కొని వస్తువులు తయారు చేసేవారని కానీ నేడు ట్రెండ్ మారిందన్నారు. ఖాతాదారులకు నచ్చిన ఆకృతుల్లో లైట్ వెయిట్ లో అభరణాలు తయారు చేసే మలబార్ వంటి సంస్థలు రావడం అభినందనీయమన్నారు. బంగారం అనేది మన సంస్కృతిలో ఒక భాగం, ఒక ఆస్తి అని అన్నారు. గోల్డ్ కవరింగ్ కు మచిలీపట్నం ప్రసిద్ధి అని ఇకపై బంగారు ఆభరణాలకు కేంద్రంగా మారబోతోందన్నారు. ఆభరణాల తయారీలో నిష్ణాతులైన వ్యక్తులు ఇక్కడ ఉన్నారన్నారు. వారి నైపుణ్యాన్ని బంగారు ఆభరణాల తయారీలో వినియోగించుకుని ముందుకు వెళ్లాలని కోరారు. మారుతున్న కాలంలో ప్రజల అభిరుచులు కూడా మారుతున్నాయన్నారు. బంగారం ధరలు రోజురోజుకి పెరుగుతున్నా ప్రజల్లో ఆదరణ ఎక్కడా కూడా తగ్గడం లేదన్నారు. ఈ నేపథ్యంలో బంగారం ఉత్పత్తిని దేశంలో పెంచుకోవల్సిన అవసరం ఉందన్నారు. 5% ఆదాయం సీఎస్ఆర్ కోసం మలబార్ సంస్థలు కేటాయించడం అభినందనీయమన్నారు. మచిలీపట్నం అభివృద్ధిలో కూడా మలబార్ భాగస్వామ్యం ఉండాలన్నారు. పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ కూడా షోరూమ్ ని సందర్శించి మలబార్ యాజమాన్యానికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్ ఛార్జ్ బండి రామకృష్ణ, నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, మలబార్ రిటైల్ హెడ్ సిరాజ్, జోనల్ హెడ్ నిఖిల్ చంద్ర, మార్కెటింగ్ హెడ్ రాకేష్ కుమార్, మచిలీపట్నం స్టోర్ హెడ్ నాస్పి, మున్సిపల్ మాజీ ఛైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, తెలుగు రైతు విభాగం మాజీ అధ్యక్షులు గోపు సత్యనారాయణ, శ్యామ్ గోల్డ్ అధినేత ఉమామహేశ్వరరావు, పలువురు నగర ప్రముఖులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న లోకేష్.. ఒక్క మెసేజ్ తో ఒకరికి ప్రాణదానం

గుంటూరు,మార్చి.27 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ మరోసారి మానవత్వం చాటుకున్నారు. సోషల్ మీడియాలో తన దృష్టికి వచ్చిన సమస్యలపై వేగంగా స్పందిస్తున్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సాయం చేస్తున్నారు. లోకేష్ సేవాగుణంపై ప్రజలు ప్రశంసలు కురిపిస్తున్నారు. తాజాగా.. లోకేశ్ క్షణాల్లో స్పందించడంతో ఒకరికి అవయవ దానం, మరొకరికి ప్రాణదానం జరుగనుంది. గుంటూరులోని రమేష్ ఆస్పత్రిలో తీవ్ర అనారోగ్యంతో చేరిన చెరుకూరి సుష్మ బ్రెయిన్ డెడ్‌కు గురి అయ్యారు. దీంతో సుష్మ కుటుంబ సభ్యులు ఆమె అవయవాలను దానం చేయడానికి నిర్ణయించుకున్నారు. సుష్మ అవయవదానంతో తిరుపతిలో మరొకరికి ప్రాణదానం జరుగనుంది. సుష్మ గుండెను తిరుపతిలోని మరొకరికి అమర్చనున్నారు. గుంటూరు నుంచి తిరుపతికి గుండెను తరలించడానికి సొంత ఖర్చులతో మంత్రి లోకేశ్ ప్రత్యేక విమానం ఏర్పాటు చేశారు. ఇవాళ(గురువారం) రాత్రి 7 గంటలకు గ్రీన్ ఛానెల్ ద్వారా గుండెను గుంటూరు రమేష్ ఆస్పత్రి సిబ్బంది తిరుపతికి తరలించనున్నారు. దీంతో గుండె మార్పిడి విజయవంతం చేయడానికి వైద్యులు యుద్ధ ప్రాతిపదికన ఏర్పాట్లు చేస్తున్నారు. సకాలంలో స్పందించిన మంత్రి నారా లోకేశ్‌కు సుష్మ కుటుంబ సభ్యులు, రమేశ్ హాస్పిటల్స్ వైద్యులు కృతజ్ఞతలు తెలిపారు..

## జూనియర్ డాక్టర్ సూసైడ్ కేసులో ముద్దాయి అరెస్ట్

రాజమహేంద్రవరం (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



జూనియర్ డాక్టర్ సూసైడ్ కేసులో ముద్దాయిని ప్రకాష్ నగర్ పోలీసులు పట్టుకుని అరెస్ట్ చేశారు. రాజమండ్రిలో గురువారం స్థానిక ప్రకాష్ నగర్ పోలీస్ స్టేషన్లో జరిగిన విలేకరుల సమావేశంలో పోలీస్ అధికారులు వివరాలను వెల్లడించారు...తూర్పు గోదావరి జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ డి.నరసింహ కిషోర్ మరియు సౌత్ జోన్ డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్, ఎస్. భవ్య కిషోర్ ఆదేశాల ప్రకారం రాజమహేంద్రవరం ప్రకాష్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన జూనియర్ డాక్టర్ సూసైడ్ కేసులో ముద్దాయి దువ్వాడ మాధవ రావు దీపక్ ని పట్టుకొని అరెస్ట్ చేశామన్నారు. దువ్వాడ మాధవ రావు దీపక్ పై ప్రత్యేక నిఘా పెట్టగా గురువారం రాజమహేంద్రవరం విద్య నగర్ లోని ఇంటి వద్ద ముద్దాయిని అదుపులోకి తీసుకొని విచారించినట్లు పోలీసులు తెలిపారు..పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.కిమ్స్ బొల్లినేని హాస్పిటల్ లో ఫార్మాలజిస్ట్ గా పని చేస్తున్న నల్లపు నాగంజలి మార్చి 24న హాస్పిటల్ నందు డ్యూటీ చేసే సమయంలో సూసైడ్ అటెంప్ట్ చేసినట్లు నాగంజలి తండ్రి నల్లపు దుర్గ రావు ఫిర్యాదు చేశారన్నారు. ఫిర్యాదు ఇచ్చిన వివరాలు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.. తన కుమార్తె నల్లపు నాగంజలి రాజమహేంద్రవరం రూరల్ లోని ఒక ప్రైవేటు ఫార్మా కాలేజీ నందు ఫార్మ్–డి ఫైనల్ ఇయర్ చదువుతున్నట్లు, అలాగే కిమ్స్ బొల్లినేని హాస్పిటల్ నందు 9 నెలల నుండి ఫార్మాలజిస్ట్ గా పనిచేస్తున్నట్లు తండ్రి కంప్లైంట్ లో తెలిపారు. ప్రకాష్ నగర్ కిమ్స్ హాస్పిటల్ ఏ జి ఎం దీపక్ ఆఫీస్ ప్రక్కన ఒక రూమ్ లో రెంట్ కి ఉంటునట్లు తెలిపినారు. ఒక రోజు తన కుమార్తెను కలుసుకునేందుకు తన రూమ్ కి వెళ్లానని, అక్కడ తన కూతురు డల్ గా ఉండటం గమనించానని తెలిపారు. తండ్రి ఏమైంది అని అడుగగా, నాగంజలి బొల్లినేని హాస్పిటల్ లో ఏజీఎం గా పని చేస్తున్న దువ్వాడ మాధవ రావు దీపక్ అనే వ్యక్తి ఆమె వెనకాల ప్రేమ పేరుతో తిరిగి లైంగికంగా వేదించడం, ప్రేమించానని నమ్మించి, శారీరకంగా వాడుకొని, ఎవరికి చెప్పొదు అని బెదిరించినట్లు, ఆవిడని బ్లాకు మెయిల్ చేయడం చేస్తున్నాడని తెలిపి బాధపడినట్లు ఫిర్యాదులో తండ్రి పేర్కొన్నట్టు డిఎస్పీ భవ్య కిషోర్ అన్నారు. మార్చి 23 సాయంత్రం ఫిర్యాదికి బొల్లినేని హాస్పిటల్ నుండి ఫోన్ వచ్చినట్లు అందులో నల్లపు దుర్గరావు కుమార్తె కళ్ళు తిరిగి పడిపోయినది అని తెలిపినట్లు, దుర్గరావు తన బంధువులతో కలిసి వచ్చి చూడగా తన కుమార్తె అపస్మారక స్తితిలో ఉన్నట్లు తెలిపారు. నాగాంజలి రూమ్ వద్ద ఆమె డైరీ లో ఒక సూసైడ్ నోట్ దొరికినట్లు అందులో ఆమె దీపక్ తనను ప్రేమిస్తునట్లు, లైగికంగా వేదిస్తునట్లు, శారీరకముగా అనుభవించి, టార్చర్ చేస్తునట్లు, ఆ టార్చర్ బరించలేక (ఆమె వేక్యూరోనియం బ్రోమిదే 10 ఎం జి ఇంజక్షన్ తీసుకొని), టార్చర్ చేసిన వారి ప్రోద్భలంతో చనిపోతునట్లు వ్రాసి ఉన్నాదని తెలిపారు..పోలీసు వారి ప్రాధమిక సాక్షాదారాలు ప్రకారం, ఇప్పటివరకు ఉన్న ఎవిడెన్స్ ప్రకారం ఈ కేసు లో ముద్దాయి అయిన దువ్వాడ మాధవ రావు దీపక్ ను ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ బాజిలాల్ ముద్దాయి ఇంటి వద్ద అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేసి తదుపరి విచారణ నిమ్మితం రిమాండ్ కు తరలించారు..ఈ కేసులలో ముద్దాయిని అరెస్ట్ చేయడంలో ప్రతిభ కనపరిచిన, ప్రకాష్ నగర్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ బాజిలాల్, సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ శివ ప్రసాద్, పీసీ వి. శివ ప్రసాద్, పీసీ ఈశ్వరరావు లను అభినందిస్తూ తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ ప్రత్యేకంగా అభినందించి, రివార్డ్ ప్రకటించారు.

## చిరు వ్యాపారులకి గొడుగుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి

రాజమహేంద్రవరం (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



నగరంలో రోడ్డు కి ఇరువైపులా చిరు వ్యాపారాలు చేసుకుంటున్న పలువురికి నగర శాసనసభ్యులు ఆదిరెడ్డి శ్రీనివాస్ చేతుల మీదుగా గొడుగులు బహుకరించారు గురువారం ఉదయం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయం వద్ద స్వర్ణాంధ్ర సేవా సంస్థ ఆధ్వర్యంలో సమకూర్చిన గొడుగుల ను లబ్ధిదారులకు అందించారు .ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస మాట్లాడుతూ చిరు వ్యాపారుల సంక్షేమం కోసం స్వర్ణాంధ్ర రాంబాబు చేస్తున్న సేవలు అమూల్యమని అన్నారు.నగరంలో చిరు వ్యాపారం చేసుకునే వారందరికీ గొడుగులు ఉచితంగా అందిస్తు వారికి ఎండ నుంచి వాన నుంచి రక్షణ కల్పిస్తు స్వర్ణాంధ్ర ఆదర్శనీయమని సేవలందిస్తుందన్నారు. స్వర్ణాంధ్ర నిర్వాహకులు లయన్ డాక్టర్ గుబ్బల రాంబాబు మాట్లాడుతూ రోడ్డు కి ఇరువైపులా చిరు వ్యాపారుల కోసం గొడుగులు ఉచిత రీతిన అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు.గొడుగులు కావలసినవారు ఆధార్ కార్డు జిరాక్స్ రెండు ఫోటోలతో లాలాచెరువులోని స్వర్ణాంధ్ర సేవా సంస్థ కార్యాలయాన్ని స్వయంగా సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మాజీ మొఖమాటి సత్యనారాయణ , మజ్జి రాంబాబు, కోసూరి చండీప్రియ ,తెదేపా నాయకులు ఉప్పులూరి జానకిరామ్, అజరపు రమేష్ ,కాశి తదితరులు పాల్గొన్నారు.

# ఒక్క పొరపాటు చేసినా అంతే..

# సీఎస్కేతో జాగ్రత్త

## ఆర్సీబీని హెచ్చరించిన వాట్సన్

ఐపీఎల్ 2025 సీజన్‌ను రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు విజయంతో మొదలుపెట్టింది. కోల్‌కతాను ఈడెన్ గార్డెన్స్‌లోనే ఓడించింది. ఇక చెపాక్ వేదికగా శుక్రవారం చెన్నై సూపర్ కింగ్స్‌తో తలపడనుంది. ఇది సీఎస్కే సొంత మైదానం. ఈ క్రమంలో చెన్నైతో అత్యంత జాగ్రత్తగా ఉండాలని.. ఏ ఒక్క పొరపాటు చేసినా ఓటమి తప్పదని ఆర్సీబీని మాజీ క్రికెటర్ షేన్ వాట్సన్ హెచ్చరించాడు. వాట్సన్‌కు గతంలో చెన్నై, బెంగళూరు జట్లతో కలిసి ఆడిన అనుభవం ఉండటం గమనార్హం.



**"రూ. 11 కోట్లు పెట్టారు.. అతడిని ఎనిమిదో స్థానంలో పంపిస్తారా?"**

"చెపాక్‌లో ఆర్సీబీకి పెను సవాల్ తప్పదు. సీఎస్కే జట్టులో నాణ్యమైన బౌలర్లు ఉన్నారు. చెన్నైకి దీటుగా సమాధానం ఇవ్వాలంటే బెంగళూరు కూడా సరైన కూర్పుతో బరిలోకి దిగాలి. చెపాక్ బౌలర్లకు స్వర్గధామం. సీఎస్కేను చూస్తుంటే.. ఆ జట్టులో ముగ్గురు స్పిన్నర్లు అశ్విన్, జడేజా, నూర్ అహ్మద్ అద్భుతంగా బౌలింగ్ చేస్తున్నారు. ఈ పిచ్‌పై వారిని ఎదుర్కోవడం తేలికేం కాదు. ముంబయిపై నూర్‌అహ్మద్ తీవ్ర ప్రభావం చూపించాడు. ప్రతి బంతి వికెట్ ఇచ్చేలా విసిరాడు. వికెట్ తీసేందుకు ఆ ముగ్గురు ఎప్పుడూ సిద్ధంగా ఉంటారు. ఈ విషయంలో ఆర్సీబీకి సవాల్ తప్పదు. చెన్నై బ్యాటింగ్ లైనప్ కూడా బలంగా ఉంది" అని వాట్సన్ వెల్లడించాడు.

**రాజస్థాన్ బ్యాటర్లు ఇబ్బందిపడుతున్నారు..**

"ఈసారి ఐపీఎల్‌లో రాజస్థాన్ వరుసగా రెండు మ్యాచుల్లో ఓడింది. ఆ జట్టు బ్యాటర్లు ఇబ్బందిపడుతున్నట్లు అనిపిస్తోంది. కోల్‌కతాతో జరిగిన పోరులో వరుణ్ చక్రవర్తి, మొయిన్ అలీని ఎదుర్కోలేకపోయారు. అదే సమయంలో రాజస్థాన్ బౌలర్లు మాత్రం ప్రత్యర్థిని కట్టడి చేయడంలో విఫలం కావడం చూశాం. లోతైన బౌలింగ్ లేకపోవడమూ నష్టం చేసింది. కేకేఆర్ ఓపెనర్ క్వింటన్ డికాక్ ఏ సమయంలోనూ ఒత్తిడికి గురికాకుండా తన జట్టును గెలిపించాడు. మొదట్లో ఆచితూచి ఆడి.. అవసరమైనప్పుడు బ్యాట్‌ను ఝుళిపించాడు" అని వాట్సన్ వెల్లడించాడు. రాజస్థాన్ 2008లో విజేతగా నిలిచినప్పుడు వాట్సన్ కూడా ఆ జట్టు సభ్యుడే.

# మెరుపు స్టంపింగ్..

## ఐపీఎల్‌లో ఈ రికార్డు బద్దలవుతుందా?



**ఇండియన్ ప్రీమియర్ లీగ్ ఎన్నో రికార్డులకు నెలవు. బ్యాటర్ల దూకుడు, బౌలర్ల పదునైన బంతులే కాదు.. స్టంప్స్ వెనుక కీపర్ల చూపే మెరుపు వేగం కూడా. ఐపీఎల్ చరిత్రలో రెండో వేగవంతమైన స్టంపింగ్‌ను చెన్నై సూపర్ కింగ్స్ మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ సాధించాడు. ముంబయి ఆటగాడు సూర్యకుమార్ యాదవ్‌ను 0.12 సెకన్లలోనే స్టంపౌట్ చేశాడు. ఈ నేపథ్యంలో ఐపీఎల్‌లో వేగవంతమైన స్టంపింగ్ రికార్డు చర్చలోకి వచ్చింది. తొలి స్థానం ఎవరిది? అసలు ఈ రికార్డు బద్దలయ్యే అవకాశం ఉందా?**

ఐపీఎల్‌లో అత్యంత వేగవంతమైన స్టంపింగ్ రికార్డు ధోనీ పేరిటే ఉంది. 2023 ఐపీఎల్ ఫైనల్‌లో గుజరాత్ ఆటగాడు శుభ్‌మన్ గిల్‌ను 0.1 సెకన్లలోనే స్టంపౌట్ చేశాడు. సూర్యను ఔట్ చేసిన స్టంపింగ్ ఫాస్టెస్ట్‌లో రెండో స్థానంలో నిలిచింది. మరి ధోనీ రికార్డును ఎవరైనా బీట్ చేసే అవకాశం ఉందా? నిజానికి అంత వేగం యువ కీపర్లకు కూడా కష్టమే. ధోని స్ఫూర్తిగా జితేశ్ శర్మ, ధ్రువ్ జురెల్, జోస్ బట్లర్, హెన్రిచ్ క్లాసెన్, ఫిల్ సాల్ట్, రిషభ్ పంత్, రికల్టన్ చేస్తారేమో చూడాలి. ఇక్కడే ఓ మాట చెప్పుకోవాలి. అదేదో తెలుగు సినిమాలో చెప్పినట్లు.. 'ధోనీ రికార్డును కొట్టాలంటే అవతలి వ్యక్తి కూడా ధోనీనే అయి ఉండాలి'. చూద్దాం ఈ ఐపీఎల్‌లో ఇంకా బోలెడు మ్యాచ్‌లున్నాయి. 43 ఏళ్ల ధోనీ తన రికార్డు తనే బద్దలు కొడతాడేమో. అన్నట్లు ప్రపంచ క్రికెట్‌లోనూ ఫాస్టెస్ట్ స్టంపింగ్ రికార్డు కూడా మాహీదే. 2018లో వెస్టిండీస్‌కి చెందిన కీమో పాల్‌ను 0.08 సెకన్లలో స్టంపౌట్ చేశాడు.

# "రూ. 11 కోట్లు పెట్టారు..

# అతడిని ఎనిమిదో స్థానంలో పంపిస్తారా?"

**రాజస్థాన్ రాయల్స్‌కు మళ్లీ పరాజయం ఎదురైంది. కోల్‌కతా నైట్‌రైడర్స్‌కు తొలి విజయం దక్కింది. ఐపీఎల్ 2025 సీజన్‌లో తొలి మూడు మ్యాచ్‌లకు సంజు శాంసన్ స్థానంలో రియాన్ పరాగ్ కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు. అయితే, వరుసగా రెండు మ్యాచుల్లోనూ ఓడిపోవడంతో పరాగ్ నిర్ణయాలపై ఇప్పుడు విమర్శలు మొదలయ్యాయి. కీలకమైన సమయంలో బ్యాటర్లను పంపించడంలో రియాన్ ఇబ్బందిపడుతున్నట్లు అనిపించిందని మాజీ క్రికెటర్ సైమన్ డౌల్ వ్యాఖ్యానించాడు. రూ. 11 కోట్లు పెట్టి రిటైన్ చేసుకున్న షిమ్రోన్ హెట్‌మయెర్‌ను ఎనిమిదో స్థానంలో ఆడిస్తారా? అని ప్రశ్నించాడు. కరేబియన్ లీగ్‌లో అతడిని వన్‌డౌన్ లేదా సెకండ్ డౌన్‌లో ఆడించేవాళ్లని గుర్తు చేశాడు.**



**డికాక్ సెంచరీ కాకపోవడానికి ఆర్చరే కారణమా? నెట్టింట విమర్శలు!**

"ఎందుకు హెట్‌మయెర్‌ను దిగువన పంపిస్తారు. అతడిని రిటైన్ చేసుకోవడానికి ఎంత వెచ్చించారు? రూ.11 కోట్లు పెట్టి మరీ తమవద్ద అట్టి పెట్టుకున్నారు. మరి అతడిని ఎనిమిదో స్థానంలో ఆడిస్తున్నారు. గయానాలో అతడు నాలుగో స్థానంలోపే బరిలోకి దిగేవాడు. అతడిని ఎందుకు ఐపీఎల్‌లో లోయర్ ఆర్డర్‌కు పంపించారు? అతడు ఫినిషర్ అని అనుకుంటున్నారు కదా.. కానీ, ఈ నిర్ణయం అత్యంత చెత్తదే. అతడు కేవలం హిట్టింగ్ మాత్రమే కాకుండా నిలకడగా పరుగులు చేయగల బ్యాటర్. ఇంపాక్ట్ సబ్‌ను పంపించకముందే హెట్‌మయెర్‌ను ఆడించాలి. ఒకవేళ విఫలమైతే అప్పుడు ఇంపాక్ట్‌ను బరిలోకి దింపాలి. తొలి రెండు మ్యాచుల్లో రాజస్థాన్ రాయల్స్ ప్రణాళికలు బాగోలేవు. విభిన్నమైన వ్యూహాలు, నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. కనీసం ఐదు లేదా ఆరో స్థానంలో వచ్చినా హెట్‌మయెర్ మరిన్ని పరుగులు చేసేవాడు. శుభ్‌మ్ దూబెను ఇంపాక్ట్‌గా తీసుకురావాల్సిన అవసరమే లేదు. ఆర్చర్ కూడా ఆఖర్లో సిక్స్ కొట్టాడు. వీరంతా త్వరగా ఔటైతే అప్పుడు దూబెను ఆడిస్తే బాగుండేది. ఇలా చేస్తే అదనంగా ఓ స్పిన్నర్‌ను ఇంపాక్ట్ సబ్‌గా తీసుకొనే వెసులుబాటు లభించేది" అని డౌల్ వ్యాఖ్యానించాడు.

**కేవలం 7 పరుగులే..**

కోల్‌కతా బౌలర్ల దెబ్బకు రాజస్థాన్ 15 ఓవర్లలో 110 పరుగులకే ఆరు వికెట్లను కోల్పోయింది. అప్పటికి క్రీజ్‌లో ధ్రువ్ జురెల్ ఉన్నాడు. అతడితోపాటు హెట్‌మయెర్ (7) బ్యాటింగ్ చేసేందుకు వచ్చాడు. దీంతో కనీసం 160కిపైగా పరుగులు చేసే అవకాశం ఉంది. అదే సమయంలో మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తిని తీసుకొచ్చిన కేకేఆర్ ఫలితం రాబట్టింది. హెట్‌మయెర్‌ను భారీ షాట్లు కొట్టకుండా అడ్డుకోగలిగింది. చివరికి హర్షిత్ వేసిన ఇన్నింగ్స్ 19వ ఓవర్ చివరి బంతికి భారీ షాట్‌కు యత్నించి హెట్‌మయెర్ పెవిలియన్‌కు చేరాడు. అప్పటికి 8 బంతులను ఆడిన హెట్‌మయెర్ కేవలం ఒక్క ఫోర్ మాత్రమే కొట్టాడు. ఆఖర్లో జోఫ్రా ఆర్చర్ (16: 7 బంతుల్లో 2 సిక్స్‌లు) దూకుడు ప్రదర్శించడంతో రాజస్థాన్ స్కోరు 150 పరుగుల మార్క్‌ను దాటింది.

# అలాంటి నిర్ణయాలు ఎందుకు

## పంత్, గిల్ కెప్టెన్సీపై సెహ్వాగ్ విమర్శలు

**ఐపీఎల్ 2025 సీజన్‌లో గుజరాత్ టైటాన్స్, లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ తమ తొలి మ్యాచుల్లో ఓటమిని చవిచూశాయి. పంజాబ్ చేతిలో 11 పరుగుల తేడాతో గుజరాత్ ఓడింది. ఇక దిల్లీ క్యాపిటల్స్‌తో చివరివరకూ పోరాడిన లఖ్‌నవూకు పరాజయం తప్పలేదు. ఈక్రమంలో రిషభ్ పంత్, శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీపై భారత మాజీ క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్ విమర్శలు గుప్పించాడు. సరైన నిర్ణయాలు తీసుకోవడంలో విఫలమవుతున్నారని పేర్కొన్నాడు. ఉప్పల్ వేదికగా ఇవాళ సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో లఖ్‌నవూ తలపడనుంది. దూకుడుగా ఆడే ఎస్ఆర్‌హెచ్‌ను కట్టడి చేయడంలో పంత్ దూకుడైన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందని సెహ్వాగ్ సూచించాడు.**



**పంత్.. అదే కదా నీ పని**

"తుది జట్టులో ఉన్న బౌలర్లను సరిగ్గా సద్వినియోగం చేసుకోవాల్సిన బాధ్యత కెప్టెన్‌పై ఉంటుంది. ఒకవేళ అవేశ్ ఖాన్ ఉన్నా సరే శార్దూల్ ఠాకూర్ మాదిరిగా తొలి ఓవర్‌లోనే రెండు వికెట్లు తీసేవాడు కాదేమో. ఇక్కడ దిల్లీ కేవలం ఒక్క ఓవర్‌లోనే గెలవలేదు. చివరివరకూ పోరాడి విజయం సాధించింది. లఖ్‌నవూ మ్యాచ్‌ను చేజేతులా మిస్ చేసుకుంది. తుది జట్టులో లేని వారి గురించి కాకుండా.. ఉన్నవారితో ఎలా గెలవచ్చనేది కెప్టెన్ ఆలోచించాలి. రిషభ్ పంత్ చేయాల్సిందదే. సరైన సమయంలో సరైన బౌలర్లను తీసుకురావాలి. ఈ ట్రిక్‌ను పంత్ మిస్ అయినట్లు అనిపించింది" అని సెహ్వాగ్ వ్యాఖ్యానించాడు.

**గిల్.. గొప్పగా ఏమీ లేదు**

"శుభ్‌మన్ గిల్ సారథ్యం స్థాయికి తగ్గట్టు లేదు. అతడు సిద్ధంగా లేడనిపిస్తోంది. ఉత్సాహంగానూ లేదు. ఇలా అనడానికి కారణాలున్నాయి. సిరాజ్ బౌలింగ్ అద్భుతంగా వేస్తున్నప్పుడు.. అతడిని పక్కనపెట్టి అర్షద్ ఖాన్‌ను తీసుకొచ్చాడు. పవర్‌ప్లేలో 21 పరుగులు ఇచ్చాడు. అక్కడితో పంజాబ్ ఇన్నింగ్స్‌కు ఊపు వచ్చింది. ఒకవేళ సిరాజ్‌తో కొనసాగించి ఉంటే.. పరిస్థితి వేరుగా ఉండేది. అతడిని డెత్ ఓవర్లకు తీసుకురావాల్సిన అవసరం లేదు. బౌలర్లను సద్వినియోగం చేసుకోవడంలో గిల్ ఇంకాస్త యాక్టివ్‌గా ఉండాలి" అని సెహ్వాగ్ తెలిపాడు.


# డికాక్ సెంచరీ కాకపోవడానికి ఆర్చరే కారణమా? నెట్టింట విమర్శలు!

**ఐపీఎల్ 18వ సీజన్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్ అద్భుతమైన విజయం సాధించింది. కేకేఆర్ ఓపెనర్ క్వింటన్ డికాక్ (97లి) చివరివరకూ క్రీజ్‌లో ఉండి జట్టును గెలిపించాడు. తొలుత బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ 151/9 స్కోరు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనలో కోల్‌కతా 17.3 ఓవర్లలోనే రెండు వికెట్లను మాత్రమే కోల్పోయి విజయం సాధించింది. ఈక్రమంలో రాజస్థాన్ బౌలర్ జోఫ్రా ఆర్చర్‌పై సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు వస్తున్నాయి. క్రీడాస్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరించాడంటూ కామెంట్లు చేస్తున్నారు. అసలేం జరిగిందంటే?**

**కోల్'ఖాతా' తెరిచింది**

ఆరంభంలో కాస్త ఆచితూచి ఆడిన డికాక్.. కీలక సమయంలో వేగం పెంచాడు. 35 బంతుల్లో హాఫ్ సెంచరీ మార్క్‌ను తాకిన అతడు 17 ఓవర్లు ముగిసేసరికి 58 బంతుల్లో 81 పరుగులకు చేరాడు. అప్పటికి కోల్‌కతా స్కోరు 135/2. ఇంకా కేవలం 17 పరుగులు మాత్రమే చేయాలి. 18వ ఓవర్‌ను జోఫ్రా ఆర్చర్ వేశాడు. మొదటి బంతిని ఫోర్‌గా మలిచిన డికాక్.. రెండో బంతికి సిక్స్ కొట్టాడు. దీంతో అతడు 91 పరుగులకు చేరాడు. మరో తొమ్మిది కొడితే అతడి సెంచరీ పూర్తయ్యేది. జట్టు విజయానికి ఏడు పరుగులు చాలు. అయితే, ఆర్చర్ మాత్రం వరుసగా రెండు వైడ్లు సంధించాడు. దీంతో సమీకరణం 5కి చేరింది. మూడో బంతిని డికాక్ మళ్లీ సిక్స్‌గా మలిచాడు. కోల్‌కతా విజయం సాధించింది. కానీ, డికాక్ పరుగులు మాత్రం 97 అయ్యాయి. ఒకవేళ ఆర్చర్ ఆ రెండు వైడ్లు వేయకుండా ఉండుంటే కనీసం ఒక్క బౌండరీ బాది డికాక్ సెంచరీ పూర్తి చేసేవాడని క్రికెట్ అభిమానులు కామెంట్లు చేస్తున్నారు.

"ఇదేనా క్రీడా స్ఫూర్తి. జోఫ్రా ఆర్చర్ చేసిన పని సరైంది కాదు. ఓవైపు శతకం చేసేందుకు దగ్గరగా వచ్చిన బ్యాటర్‌కు అవకాశం ఇవ్వకుండా వైడ్లు వేయడం సమంజసమేనా? రాజస్థాన్ రాయల్స్ వంటి ఫ్రాంచైజీ నుంచి ఇలాంటివి వస్తాయని అస్సలు ఊహించలేదు" "జోఫ్రా ఆర్చర్ షేమ్‌లెస్. కావాలనే అతడు బౌలింగ్ చేసినట్లు అనిపిస్తోంది. డికాక్ సెంచరీ కాకుండా అడ్డుకొనేందుకే ఇలా చేశాడు. డికాక్ నీ సూపర్ ఇన్నింగ్స్‌కు హ్యాట్సాఫ్. నిజమైన క్రీడాస్ఫూర్తి ఎప్పుడూ వెలుగులు అందిస్తూనే ఉంటుంది. ఆర్చర్ తీరు మాత్రం సరైంది కాదు"



# అల్లు అర్జున్ మెగా ఫ్యామిలీల మధ్య పెరుగుతున్న దూరం



టాలీవుడ్‌లో రెండు ప్రముఖ కుటుంబాలైన మెగా ఫ్యామిలీ మరియు అల్లు ఫ్యామిలీ మధ్య విభేదాలు మరింత తీవ్రమవుతున్నాయా? అన్న ప్రశ్నకు సినీ వర్గాల్లోనూ, సోషల్ మీడియాలోనూ హాట్ డిస్కషన్ నడుస్తోంది. గత కొంతకాలంగా ఈ రెండు ఫ్యామిలీల మధ్య చిచ్చు రాజుకుంటూ వస్తుందనే వార్తలు బయటకు వస్తున్నాయి. అయితే ఇటీవల రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా అల్లు అర్జున్ పర్మానెంట్‌గా అతన్ని అన్‌ఫాలో చేయడం ఈ వాదనలకు మరింత బలం చేకూర్చింది. వివాదానికి మూలం రాజకీయ కారణమా వాస్తవానికి మెగా ఫ్యామిలీకి పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలోని జనసేన పార్టీతో ముడిపాటు ఉంది. చిరంజీవి, రామ్ చరణ్ సహా మెగా కుటుంబానికి చెందిన చాలా మంది పవన్‌కు పూర్తి మద్దతుగా ఉన్నారు. అయితే గత ఏపీ అసెంబ్లీ ఎన్నికల సమయంలో అల్లు అర్జున్ మాత్రం జనసేనను కాకుండా, వైసీపీ అభ్యర్థికి మద్దతు ఇవ్వడం మెగా ఫ్యాన్స్‌కు నచ్చలేదు. అల్లు అర్జున్ మద్దతిచ్చిన శిల్పా రవిచంద్ర కిశోర్ రెడ్డి ఓడిపోవడంతో మెగా అభిమానులు అల్లు అర్జున్‌ను టార్గెట్ చేయడం ప్రారంభించారు. దీనితో రెండు ఫ్యామిలీల మధ్య విభేదాలు మరింత స్పష్టమయ్యాయి. అప్పటి నుంచి పవన్ కళ్యాణ్ వైపు మెగా ఫ్యామిలీ మొత్తం నిలిచిపోయి, అల్లు ఫ్యామిలీ మాత్రం కొంత దూరంగా ఉన్నట్లు కనిపిస్తోంది. ఇటీవల అల్లు అర్జున్ నటించిన 'పుష్ప 2' సినిమా విడుదలకు ముందు ఆయనపై మెగా ఫ్యాన్స్ తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేశారు. జనసేనను వ్యతిరేకించిన వ్యక్తిగా ఆయన్ని బహిష్కరించాలని కొందరు అభిమానులు కోరారు. అంతేకాదు, మెగా హీరోలెవరూ కూడా 'పుష్ప 2' గురించి ఏ ఒక్క మాట మాట్లాడలేదు. ఇది కూడా వివాదాన్ని మరింత ముదిరించిందని భావిస్తున్నారు. పుష్ప 2 సినిమా ఇండస్ట్రీ హిట్ అయినప్పటికీ రామ్ చరణ్, వరుణ్ తేజ్, సాయి ధరమ్ తేజ్ వంటి మెగా హీరోలు స్పందించలేదు. అంతే కాదు, అల్లు అర్జున్ ఇటీవల అరెస్ట్ అయిన ఘటనపై కూడా మెగా ఫ్యామిలీ నుంచి ఎవరూ స్పందించలేదు. అంతే కాకుండా, ఇటీవల రామ్ చరణ్ నటించిన 'గేమ్ ఛేంజర్' సినిమా ఫ్లాప్ అయ్యిందని ఊహాగానాలు వచ్చాయి. ఈ నేపథ్యంలో అల్లు అరవింద్ కొన్ని సందర్భాల్లో సెటైర్లు వేసినట్లు సమాచారం. ఇది కూడా రెండు కుటుంబాల మధ్య దూరం పెరగడానికి కారణమై ఉండొచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.సోషల్ మీడియా అన్‌ఫాలో మెగా ఫ్యామిలీ అల్లు ఫ్యామిలీ మధ్య కోల్డ్ వార్ తారాస్థాయికి చేరినట్టు స్పష్టమైన ఉదాహరణగా రామ్ చరణ్ అల్లు అర్జున్‌ను అన్‌ఫాలో చేయడం చెప్పుకోవచ్చు. సోషల్ మీడియాలో ఒకరినొకరు అన్‌ఫాలో చేయడం టాలీవుడ్‌లో అంత సులభంగా జరగదని, ఇది వాస్తవంగా వారి మధ్య ఉన్న విభేదాలనే రుజువు చేస్తుందని సినీ వర్గాలు చెబుతున్నాయి. అంతకు ముందే సాయి ధరమ్ తేజ్ కూడా అల్లు అర్జున్‌ను అన్‌ఫాలో చేశారు. ఇప్పుడు రామ్ చరణ్ కూడా అదే చేసేయడంతో, రెండు కుటుంబాల మధ్య బంధం మరింత దూరమైనట్టు స్పష్టమవుతోంది. అయితే రామ్ చరణ్ భార్య ఉపాసన మాత్రం ఇప్పటికీ అల్లు అర్జున్‌ను ఫాలో అవుతుండటం ఆసక్తికరమైన విషయంగా మారింది.

# దర్శక నిర్మాతలు పొగరనే ముద్ర కూడా వేశారు : యశ్



దర్శక నిర్మాతలు పొగరనే ముద్ర కూడా వేశారు : యశ్ 'కేజీఎఫ్', 'కేజీఎఫ్ 2' చిత్రాలతో పాన్ ఇండియా స్థాయికి ఎదిగిన కన్నడ స్టార్ యశ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. రాకీ భాయ్‌గా యశ్ నటనకు ఫిదా కాని సినీ అభిమాని లేడంటే అతిశయోక్తి కాదు.తన ఎనర్జిటిక్ ప్రదర్శన, పవర్‌ఫుల్ స్క్రీన్ ప్రెజెన్స్‌తో దేశవ్యాప్తంగా అభిమానులను సంపాదించుకున్నారు. ఇప్పుడు ఆయన తన తదుపరి చిత్రం 'టాక్సిక్'లో నటించేందుకు సిద్ధమవుతున్నారు.ఇటీవల యశ్ 'మనద కదలు' సినిమా ట్రైలర్ లాంచ్‌లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా తన కెరీర్ ప్రారంభ దశలో ఎదుర్కొన్న అనుభవాలను పంచుకున్నారు.యశ్ మాట్లాడుతూ "కెరీర్ ప్రారంభంలో నటుడిగా నా స్థానం సంపాదించుకోవడం చాలా కష్టమైనది. నాకు వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంతో శ్రమించాను.అయితే నేను పని చేసేందుకు ముందు కథ పూర్తిగా తెలుసుకోవాలనుకునేవాడిని.దర్శక నిర్మాతలు పొగరనే ముద్ర కూడా వేశారు యశ్‌దర్శకులను పూర్తి స్క్రిప్ట్ చెప్పాలని అడిగేవాడిని. అదే కొంతమందికి నచ్చేది కాదు. దాంతో వారు నాకు పొగర అనే ముద్ర వేశారు," అని చెప్పారు.అయితే ఈ కారణంగా చాలా మంచి అవకాశాలను కోల్పోయినట్లు యశ్ గుర్తు చేసుకున్నారు. "అలాంటి పరిస్థితుల్లో నిర్మాత కృష్ణప్ప నాకు బలమైన మద్దతుగా నిలిచారు. ఆయన నాపై నమ్మకం ఉంచారు. ఆ సమయంలో దర్శకుడు శశాంక్ నాకు పూర్తి కథ వివరించగా, 'మొగ్గిన మనసు' సినిమా నా కెరీర్‌ను మలుపుతిప్పింది. ఇప్పటికీ ఆ చిత్ర బృందంపై నాకు అపారమైన గౌరవం ఉంది," అని యశ్ భావోద్వేగంగా తెలిపారు. యశ్ అభిప్రాయాలు కొత్త సినీ ఆశావాదులకు స్ఫూర్తినిచ్చేలా ఉన్నాయి. తన ప్రస్థానంలో ఎదురైన ఆటుపోట్లను అధిగమించి, దేశవ్యాప్తంగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యశ్ ప్రస్తుతం 'టాక్సిక్' చిత్రంతో మరింత హైప్ క్రియేట్ చేస్తున్నారు. ఈ చిత్రం గురించి త్వరలోనే మరిన్ని అప్‌డేట్స్ రానున్నాయి.

## వైరల్ వీడియో - తారక్ పై అభిమానంతో తెలుగు నేర్చుకున్న జపాన్ బ్యూటీ



–కానీ ఈసారి కాస్త భిన్నంగా ఒక అభిమాని ఆర్ ఆర్ ఆర్ సినిమా చూసాక తెలుగు నేర్చుకున్నట్లు చెప్పడం నాకెంతో సంతోషాన్నిచ్చింది.

వైరల్ వీడియో – తారక్ పై అభిమానంతో తెలుగు నేర్చుకున్న జపాన్ బ్యూటీ! 'దేవర' జపాన్ లో రిలీజ్ సందర్భంగా యంగ్ టైగర్ ఎన్టీఆర్ సతీసమేతంగా ఆ దేశం వెళ్లిన సంగతి తెలిసిందే. ప్రచారం లో భాగంగా తారక్ జపాన్ కి వెళ్లాల్సి వచ్చింది. అయితే ఈసారి జపాన్ ట్రిప్ తారక్ కి ఓ గొప్ప జ్ఞాపకంగా మిగిలిపోయింది. దీనికి సంబంధించి తారక్ ఓ ఇంట్రెస్టింగ్ ట్వీట్ చేసారు. 'జపాన్ వెళ్లిన ప్రతీసారి నాకు బ్యూటీఫుల్ మెమోరీస్ లభిస్తాయి. కానీ ఈసారి కాస్త భిన్నంగా ఒక అభిమాని ఆర్ ఆర్ ఆర్ సినిమా చూసాక తెలుగు నేర్చుకున్నట్లు చెప్పడం నాకెంతో సంతోషాన్నిచ్చింది. సంస్కృతుల మధ్య వారధిగా ఉన్న సినిమా, భాషను నేర్చుకునేలా చేయడాన్ని సినిమా, భాషా ప్రేమికుడిగా నేను ఎప్పటికీ మర్చిపోలేను' అన్నారు. నిజంగా తారక్ కి ఈ ట్రిప్ గొప్ప జ్ఞాపకమనే చెప్పాలి. అభిమాన హీరో కోసం జపాన్ అభిమాని తెలుగు నేర్చుకున్నారు? అంటే ఓ తెలుగు వాడిగా తారక్ ఎంతో గర్వపడాలి. తన మీద ప్రత్యేకమైన అభిమానంతో తెలుగు నేర్చుకుని రాయడం..మాట్లాడటం అంటే? ఇది మాటల్లో చెప్పలేని ప్రేమగానే చెప్పాలి. . టాప్ లిస్ట్ ఇదే! జపాన్ లో తారక్ అభిమానులున్నారని తెలుసు. కానీ మరీ ఈ రేంజ్ లో అభిమానం చూపించే వారు ఉన్నారని మరోసారి బయట పడింది. అంతకు ముందు తారక్ లండన్ వెళ్లిన సమయంలో ఓ జపాన్ అభిమాని ఎంతగా ప్రేమ చూపించిందో తెలిసిందే. తారక్ ని కలవడం కోసమే లండన్ కు వచ్చినట్లు ఆమె తెలిపారు. అదే సమయంలో తప్పకుండా మళ్లీ జపాన్ రావాలని ఆ లేడీ అభిమాని తారక్ ని స్వాగతించారు. ఆ తర్వాత తారక్ జపాన్ వెళ్లడం ఇదే తొలిసారి. మరి ఆ లేడీ అభిమానిని తారక్ కలిసాడో ? లేదో. ప్రస్తుతం 'దేవర' జపాన్ థియేటర్లలో రన్నింగ్ లో ఉంది. సినిమాకి అక్కడ మంచి టాక్ వచ్చింది. మరి వసూళ్ల లెక్క తేలాల్సి ఉంది. ప్రస్తుతం తారక్ బాలీవుడ్ లో లో నటిస్తోన్న సంగతి తెలిసిందే. అలాగే ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో డ్రాగన్ లోనూ నటిస్తున్నాడు.




# బన్నీ.. ఒకేసారి రెండు టార్గెట్లు

– సుకుమార్ డైరెక్షన్‌లో వచ్చిన ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా 1800 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించి బన్నీకి పాన్ ఇండియా స్టార్‌డమ్ ముద్ర వేసింది.



స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్ కెరీర్‌ను 'పుష్ప 2' మరో ఎత్తుకు తీసుకెళ్లింది. సుకుమార్ డైరెక్షన్‌లో వచ్చిన ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా 1800 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించి బన్నీకి పాన్ ఇండియా స్టార్‌డమ్ ముద్ర వేసింది. అయితే ఈ రెండు భాగాల 'పుష్ప' కోసం బన్నీ దాదాపు ఐదేళ్ల సమయం వెచ్చించాల్సి వచ్చింది. ఇది ఆయనకు స్టార్ హీరోగా ఉండే అత్యున్నత సమయంలో చాలా ఎక్కువ టైం. ఇప్పుడు అదే లోటును భర్తీ చేయడానికి బన్నీ పూర్తిగా స్పీడ్ మోడ్‌లోకి మారిపోయారు. మన స్టార్స్ పుష్ప 2 విజయంతో పాటు వచ్చిన వన్ మేన్ మాస్ ఇమేజ్‌ను ఉపయోగించుకుంటూ, అల్లు అర్జున్ తన తదుపరి ప్రాజెక్టులకు క్లియర్ షెడ్యూల్ ప్లాన్ చేసుకున్నాడు. ఇందులో భాగంగా అట్లీ డైరెక్షన్‌లో ఓ భారీ మాస్ యాక్షన్ ఎంటర్టైనర్‌కు కమిట్ అయ్యాడు. ఈ సినిమా స్క్రిప్ట్ వర్క్, ప్రీ ప్రొడక్షన్ పనులు ఇప్పటికే కొనసాగుతున్నాయి. ఇది పూర్తిగా మాస్ మార్కెట్‌ను టార్గెట్ చేస్తూ రూపొందించనున్న చిత్రంగా తెలుస్తోంది. ఇప్పటికే నిర్మాత నాగవంశీ త్రివిక్రమ్ దర్శకత్వంలో బన్నీ చేయబోయే సినిమా గురించి క్లారిటీ ఇచ్చాడు. "అల్లు అర్జున్ గారు రెండు సినిమాలను ఒకేసారి ప్లాన్ చేయాలనుకున్నారు. మేము మా షుటింగ్ షెడ్యూల్‌ను కూడా అలా ప్లాన్ చేస్తున్నాం. త్రివిక్రమ్ గారి సినిమా 2025 ద్వితీయార్థంలో స్టార్ట్ అవుతుంది," అంటూ వెల్లడించారు. అంటే అట్లీ సినిమా షుటింగ్ కొనసాగుతుండగానే త్రివిక్రమ్ చిత్రం సెట్స్‌పైకి రానుంది. ఒకదాని తర్వాత ఒకటి కాకుండా, రెండింటినీ సమాంతరంగా చేయాలన్నది బన్నీ ఫిక్స్ చేసిన డెడ్‌లైన్.టాప్ లిస్ట్ ఇదే! ఇది చూస్తే బన్నీ గతంలో చేసిన తప్పును మళ్లీ చేయకుండా, మార్కెట్‌ను పూర్తిగా క్యాష్ చేసుకునే దిశగా దూసుకెళ్తున్నాడనే విషయం స్పష్టమవుతోంది. స్టార్ హీరోగా ఉన్న సమయంలో ఎక్కువ సినిమాలు చేయడం, ఎక్కువ మార్కెట్ బేస్ సెట్ చేసుకోవడం ఇప్పుడు అవసరమైనది. 'పుష్ప 2' తో వచ్చిన మ్యానరిజమ్, క్రేజ్‌ను కాపాడుకోవాలంటే కన్సిస్టెంట్‌గా సినిమాలు విడుదల చేయాల్సిన అవసరం బన్నీకి ఉంది. ప్రస్తుతం త్రివిక్రమ్ స్క్రిప్ట్ వర్క్‌లో బిజీగా ఉన్నాడు. అట్లీ సినిమా కూడా బన్నీ సిగ్నల్ ఇవ్వగానే సెట్స్‌పైకి వెళ్లేలా అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ రెండు ప్రాజెక్టులు 2025లో బ్యాక్ టు బ్యాక్ బన్నీని పాన్ ఇండియా స్టార్‌గా మరింత ఎస్టాబ్లిష్ చేసే అవకాశాలున్నాయి. అన్ని విషయాల్లో క్లారిటీ, కంట్రోల్ ఉన్న బన్నీకి ఇప్పుడు తక్కువ టైమ్‌లో ఎక్కువ వర్క్ చేయాల్సిన అవసరం ఉంది. మరి ఈ ప్రయత్నంలో అతని మార్కెట్ రేంజ్, అలాగే హీరోగా క్రేజ్.. ఇంకా ఏ స్థాయిలో పెరుగుతుందో చూడాలి.

# ఊపేయడానికి సిద్ధమైన హాట్ బ్యూటీ



–అమ్మడు తొలుత ఓ లవ్ స్టోరీతో వచ్చిన సమయంలో పూరి కళ్లలో పడటంతో 'ఇస్మార్ట్ శంకర్' లో చాన్స్ అందుకుంది.

ఊపేయడానికి సిద్ధమైన హాట్ బ్యూటీ! 'ఇస్మార్ట్ శంకర్' తో హాట్ బ్యూటీ గా వెలుగులోకి వచ్చిన నభా నటేష్ గురించి పరిచయం అవసరం లేదు. అమ్మడు తొలుత ఓ లవ్ స్టోరీతో వచ్చిన సమయంలో పూరి కళ్లలో పడటంతో 'ఇస్మార్ట్ శంకర్' లో చాన్స్ అందుకుంది. / దీంతో నభా అవకాశాలకు దూరమైంది. సోషల్ మీడియాలో మాత్రం యాక్టివ్ గా ఉంటూ అటెన్షన్ డ్రా చేస్తుంది. ఇన్ స్టాలో వెడెక్కించే ఫోటోలతో..భంగిమలతో అలరిస్తుంది. ఈ నేపథ్యంలో తాజాగా బ్యూటీ ఐటం భామగా కొత్త టర్నింగ్ తీసుకుంది. అదీ బాలీవుడ్ లో ఆ ఛాన్స్ రావడం విశేషం. సన్ని డియోల్ హీరోగా గోపీచంద్ మలినేని జాట్‌అనే యాక్షన్ చిత్రాన్ని తెరకెక్కిస్తోన్న సంగతి తెలిసిందే. – స్టైల్‌లో బాలీవుడ్‌ను మించుతున్న మన స్టార్స్ ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్– పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంస్థలు హిందీలోనే నిర్మిస్తున్నాయి. ఇందులో ఐటం పాటకు పలువురు భామల్ని పరిశీలించి చివరిగా నభా నటేష్ ని ఎంపిక చేసారు. ఈ పాట కోసం హైదరాబాద్ లో ప్రత్యేకంగా ఓ భారీ సెట్ ని సిద్ధం చేసారు. నేటి నుంచే ఆ పాట చిత్రీ కరణ కూడా మొదలవుతుందని సమాచారం. ఇప్పటి వరకూ నభా నటేష్ ఐటం పాటల్లో నటించలేదు. తొలిసారి ఆ రకంగానూ అమ్మడు అదృష్టాన్ని పరీక్షించుకుంటుంది. హీరోయిన్ అవకాశాలు లేని నేపథ్యం లో? మొదలైన ఈ కొత్త జర్నీతోనైనా బిజీ అవుతుందేమో చూడాలి. తెలుగులో చివరిగా డార్లింగ్ చిత్రంలో నటించింది. ఈ సినిమా గత ఏడాది రిలీజ్ అయింది. ఆ తర్వాత మళ్లీ కొత్త ప్రాజెక్ట్ దేనికి సైన్ చేయలేదు.

# రష్మిక కష్టానికి ప్రతిఫలం వస్తుందా

**రష్మిక సెంటిమెంట్ కారణంగా సల్మాన్‌కి హిట్ పడే అవకాశాలు ఉన్నాయని ఫ్యాన్స్ నమ్మకంగా ఉన్నారు.**



సౌత్ సినిమాలు, బాలీవుడ్ సినిమాలతో బ్యాక్ టు బ్యాక్ విజయాలను సొంతం చేసుకున్న రష్మిక మందన్న రంజాన్ సందర్భంగా 'సికిందర్' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు రెడీ అవుతోంది. బాలీవుడ్ సూపర్ స్టార్ సల్మాన్ ఖాన్ హీరోగా నటించిన సికిందర్ సినిమాకు తమిళ్ స్టార్ దర్శకుడు మురుగదాస్ దర్శకత్వం వహించిన విషయం తెల్సిందే. సినిమాకు ఇప్పటి వరకు పెద్దగా బజ్ క్రియేట్ కాలేదు. కానీ రష్మిక నటించింది అనే ఒకే ఒక్క కారణం వల్ల చాలా మంది సినిమాపై పాజిటివ్‌గా ఉన్నారు. సల్మాన్ ఖాన్ గతంలో ఎప్పుడు లేని విధంగా తీవ్రమైన ఒడిదొడుకులు ఎదుర్కొంటున్నాడు. రష్మిక సెంటిమెంట్ కారణంగా సల్మాన్‌కి హిట్ పడే అవకాశాలు ఉన్నాయని ఫ్యాన్స్ నమ్మకంగా ఉన్నారు. యానిమల్, పుష్ప 2, ఛావా సినిమాలతో రష్మిక బాక్సాఫీస్ వద్ద చేసిన హంగామా గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు, మూడు సినిమాలతో దాదాపు రూ.3300 కోట్ల వసూళ్లను తన ఖాతాలో కేవలం ఏడాదిన్నర లోపే సొంతం చేసుకుంది. మూడు సినిమాల్లోనూ పవర్ ఫుల్ భార్య పాత్రలో కనిపించింది. ముఖ్యంగా ఛావా సినిమాలో నటనతో మెప్పించింది అంటూ విమర్శకుల ప్రశంసలు దక్కించుకుంది. ఛావా సినిమా జోరు ఇంకా కంటిన్యూ అవుతూనే ఉంది. ఇలాంటి సమయంలో రాబోతున్న సికిందర్ సినిమాతో రష్మిక తన సక్సెస్ జర్నీని కంటిన్యూ చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఛావా సినిమా ప్రమోషన్‌లో రష్మిక కుంటుకుంటూ వచ్చిన విషయం తెల్సిందే. కాలికి అయిన గాయంను లక్ష్య పెట్టకుండా ఛావా ప్రమోషన్స్‌లో పాల్గొంది. ఈ ఏడాది ఆరంభంలో రష్మిక జిమ్‌లో వర్కౌట్లు చేస్తున్న సమయంలో కాలికి గాయం అయింది. దాంతో కొన్ని రోజుల పాటు రష్మిక కనీసం నడవలేక పోయింది. ఛావా సినిమా ప్రమోషన్స్‌కి తన అవసరం ఉండటంతో రష్మిక స్టాండ్ పట్టుకుని స్టేజ్ మీద కనిపించింది. ఛావా విడుదలై మంచి విజయాన్ని సొంతం చేసుకున్న తర్వాత కూడా రష్మిక స్టాండ్‌తోనే కనిపించింది. ప్రమోషన్స్‌లో పూర్తిగా స్టాండ్‌తోనే లేదంటే ఎవరైనా హెల్ప్‌తో పాల్గొంది. సల్మాన్ ఖాన్‌తో సికిందర్ ప్రమోషన్స్‌లోనూ రష్మిక కాలి గాయంతోనే ఇబ్బంది పడుతూ ప్రమోషన్‌లో పాల్గొంది. రష్మిక పూర్తి స్థాయిలో సొంతంగా నడవలేక పోతుంది. ఇంకా కుంటుకుంటూనే నడుస్తున్న వీడియోలు వైరల్ అవుతున్నాయి. . టాప్ లిస్ట్ ఇదే! ఇటీవల ఒక చిట్‌చాట్‌లో రష్మిక తన కాలి గాయం గురించి స్పందించింది. కాలు గాయం ఇప్పుడిప్పుడే తగ్గుతుంది. పూర్తిగా తగ్గడానికి 9 నెలల సమయం పడుతుందని అన్నారు. అయితే అప్పటి వరకు వెయిట్ చేయాలని అనుకోలేదు. మెల్ల మెల్లగా వర్క్‌లో బిజీ అవుతున్నాను. జాగ్రత్తగా కాలుపై ఎక్కువగా ఒత్తిడి లేకుండా జాగ్రత్తగా షుటింగ్‌లో పాల్గొంటున్నట్లు రష్మిక చెప్పుకొచ్చింది. సికిందర్ సినిమా విడుదల తర్వాత రష్మిక కుబేర, ది గర్ల్ ఫ్రెండ్, రెయిన్ బో సినిమాలతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. కుబేర సినిమా షుటింగ్ పూర్తి కాగా గర్ల్ ఫ్రెండ్ షుటింగ్ చివరి దశలో ఉంది. ఇవి కాకుండా మరికొన్ని సినిమాలు సైతం చర్చల దశలో ఉన్నట్లు సమాచారం అందుతోంది. త్వరలోనే రష్మిక కొత్త సినిమాల ప్రకటన ఉండే అవకాశం ఉంది.

TELUGU RASTRAM . Printed, Published and Owned by A.RAJASEKHAR. Printed at Ajay Sri Printers, D.No. 4/151, Aithabathulavari centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P Published at D.No. 4-151, Aithabathulavari Centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P. Editor: A.RAJASEKHAR, . RNI NO. APTEL/2016/66202, email: telugurastram2016@gmail.com, Phone No. 8074368339